రంగారెడ్డి

# సాయి సూర్య

తెలుగు దిన పత్రిక

www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229

పేజీలు : 08 వెల : 04/-

ప్రచురణ : హైదరాబాద్ సంపుటి : 01, సంచిక : 52, ఎడిటర్ : పోలగోని రాజేష్, సోమవారం 21-4-2025

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశలు అడియాశలు.**

3లో

**మంత్రి పదవి రాకపోతే రాజీనామా చేస్తా**

3లో

# గ్రహశకలం ఢీ కొంటే.. ఇండియాలో నాశనమైయ్యే నగరాలు ఇవే!

- 500 అణుబాంబులతో సమానమైన గ్రహశకలం భూమిని ఢీ కొంటే..
- ఇండియాలో ఎఫెక్ట్ అయ్యే ప్రాంతాలు ఇవే!





వైఆర్4 అనే గ్రహశకలం భూమిని ఢీ కొట్టేందుకు దూసుకొస్తుందని నాసా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. భూమిని ఢీ కొట్టే అవకాశం రోజురోజుకి పెరుగుతున్న క్రమంలో అసలు ఒక వేళ భూమిని నిజంగానే ఢీ కొంటే ఏ ప్రాంతంలో ఢీ కొంటుందని కూడా సైంటిస్టులు అంచనా వేశారు. ఆ ప్రభావిత ప్రాంతాల్లో ఇండియా కూడా ఉంది. మరి ఇండియా మొత్తం పోతుందనే అంటే.. కాదు. ఇండియాలోని కొన్ని నగరాలకే ముప్పు పొంచి ఉంది. అవేంటో ఇప్పుడు చూద్దాం.. మనవాళి, కోట్ల కొలది జీవరాసులు జీవిస్తున్న ఈ భూ గ్రహానికి ముప్పు పొంచి ఉందని గతేడాది డిసెంబర్‌లో నాసా ఓ సంచలన ప్రకటన చేసింది. ఓ గ్రహశకలం భూమిని ఢీ కొట్టేందుకు దూసుకొస్తుందని, అది కనుక భూమిని ఢీ కొంటే ఓ 500 బాంబులు పడినంత విధ్వంసం సృష్టిస్తుందని తెలిపారు. 2024 డిసెంబర్ 27న చిలీలోని ఎల్ సాస్ అబ్జర్వేటరీ ఈ ముప్పును కనిపెట్టింది. ఈ అబ్జర్వేటరీ కూడా నాసా ఆధ్వర్యంలోనే నడుస్తుంది. ఈ గ్రహశకలానికి 2024 YR4 అనే పేరు పెట్టారు. 2032 డిసెంబర్‌లో ఇది భూమిని ఢీ కొనే ఛాన్స్ ఉందంటున్నారు.

మిగతా 2లో



# హైదరాబాద్‌లో ఎకో టౌన్..

జపాన్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పర్యావరణహిత కిటాక్యూషు నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకుంటుంది. కిటాక్యూషు సిటీ మేయర్ కజుహిసా టేకుచితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర మోడల్స్, నదుల పునరుజ్జీవన విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్‌ఎల్పీ , నిప్పాన్ స్టీల్ ఇంజినీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ పై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యూషు మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ కిటాక్యూషు నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేకుచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదు అవసరం అని అభిప్రాయపడ్డారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితో పాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయటం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాద కరమై పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితో పాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని అన్నారు. హైదరాబాద్%-% కిటాక్యూషు రెండు నగరాల మధ్య విమాన ప్రయాణ ఏర్పాటు చేయాలనే అంశం ఈ సందర్భంగా చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాషా పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువ శక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కలిగిస్తే, అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవన ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది, పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. తెలంగాణకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించే

మిగతా 2లో



# ఆర్టీసీలో త్వరలోనే 3038 ఉద్యోగాలకు నోటిఫికేషన్ !

**హైదరాబాద్:** తెలంగాణలోని నిరుద్యోగులకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త అందించారు. టీజీఎస్ఆర్టీసీలో ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీలో 3038 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీటిలో 2 వేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ ఉద్యోగాలతోపాటు పలు పోస్టులు ఉంటాయని వెల్లడించారు.

మొత్తం 3038 ఉద్యోగాల్లో
%డ్రైవర్ -2000
శ్రామిక్ -743
డిప్యూటీ సూపరిండెంట్ (ట్రాఫిక్) %- 84
%డిప్యూటీ సూపరిండెంట్ (మెకానికల్) %- 114
%డిపో మేనేజర్/ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ %- 25
%అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ - 18

మిగతా 2లో

# ఆదివాసుల అభివృద్ధి పునరంకితం



ఆదిలాబాద్: జల్, జంగల్, జమీన్ నినాదంతో తమ ప్రభుత్వం ఆదివాసుల అభివృద్ధికి పాటుపడుతుందని, పోలీస్ కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకునే బాధ్యత తమపై ఉందని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ ( సీతక్క) అన్నారు. 44 ఏళ్ల కిందట ఇంద్రవెల్లి కాల్పుల్లో మృతి చెందిన గిరిజనులను స్మరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద మంత్రి సీతక్క ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాల్పుల్లో మృతి చెందిన 15 కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ట్రైకార్ పథకం కింద ట్రాక్టర్లు

మిగతా 2లో



# తెలంగాణకు దశ, దిశ..గులాబీ జెండానే

- కేటీఆర్
- సంక్షేమాన్ని రెండింటిని సమానంగా తీసుకువెళ్లారు.
- బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణ సమాజం ఎంతో నష్టపోయింది
- రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం, తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి
- కేసీఆర్ ఆనవాళ్లు తొలగిస్తామనడం అనాగరికం
- ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

2లో

# అంగారకుడిపై మిస్టరీ శిల!





- అంగారకుడిపై వింత రాయిని గుర్తించిన నాసా పెర్సెవరెన్స్ రోవర్
- చుట్టూ లేత రంగు ప్రాంతం ఉండగా, ఈ రాయి ముదురు రంగులో, గుంతలతో ఉన్న వైనం
- రాయి మూలాలపై శాస్త్రవేత్తల బృందం పరిశోధన

# మీరు చూపిన అభిమానం, ఆప్యాయతతో మనసు ఉప్పొంగింది: సీఎం చంద్రబాబు




- తెలుగుజాతి అభ్యున్నతికి పునరంకితం అవుతానని ప్రకటన
- ప్రపంచంలోనే శక్తిమంతంగా తెలుగుజాతి ఉండాలని పునరుద్ఘాటన
- నా ప్రయాణంలో తోడుగా నిలిచినందుకు కృతజ్ఞతలు

# సీఎంకు రేవంత్‌కు రైతు గోడు పట్టదా? : బండి సంజయ్







# హిందువులకు ఒకే ఆలయం, ఒకే బావి ఉండాలి: మోహన్ భగవత్

# పాకిస్థాన్‌లో హిందూ మంత్రిపై దాడి



# హైదరాబాద్‌లో ఎకో టౌన్..

లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం జపాన్‌లో పర్యటిస్తోంది. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా సాగుతున్న ఈ పర్యటనలో భాగంగా బృందం ఇప్పటికే పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది, ప్రముఖ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది.తెలంగాణ యువతకు విదేశాల్లో, ముఖ్యంగా జపాన్‌లో ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. జపాన్‌కు చెందిన టెర్న్, రాజ్ గ్రూప్ అనే రెండు ప్రముఖ సంస్థలతో వేర్వేరుగా అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా ఆరోగ్య సంరక్షణ రంగంలో 200, ఇంజినీరింగ్ రంగంలో 100, పర్యాటక రంగంలో 100, నిర్మాణ రంగంలో 100 చొప్పున మొత్తం 500



ఉద్యోగావకాశాలు లభించనున్నాయని అధికారులు తెలిపారు.తెలంగాణ బృందం తమ పర్యటనలో భాగంగా కితాక్యూషు నగరాన్ని సందర్శించింది. అక్కడ నగర మేయర్ కజుహిసా టకేచీతో సమావేశమైంది. ఒకప్పుడు తీవ్ర కాలుష్యంతో సమస్యలను ఎదుర్కొని, నేడు పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన కితాక్యూషు నగరం సాధించిన ప్రగతిని, అమలు చేసిన ప్రణాళికలను బృందం అధ్యయనం చేసింది. ఈ సందర్భంగా మురసాకి రివర్ మ్యూజియం, ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం, ఎకో టౌన్ సెంటర్‌లను కూడా సందర్శించారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ బృందం మరో రెండు రోజుల పాటు జపాన్‌లో ఉండనుంది. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం లక్ష్యంగా మరిన్ని సమావేశాలు, చర్చలు జరపనున్నారు.

# ఆదివాసుల అభివృద్ధి పునరంకింతం

భూమి కోసం భుక్తి కోసం పోరాడిన ఆదివాసులకు హక్కులతో పాటు వారి ఆశయాల సాధన కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. సంస్మరణ సభలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంద్రవెల్లి నుండే సమర శంఖం పూరించి అధికారంలోకి రావడం జరిగింది అన్నారు. పోలీసుల కాల్పుల్లో మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవడంతోపాటు మారుమూల గిరి గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. ఇంద్రవెల్లి సంస్కరణ సభకు గతంలో పాలకులు నిషేధజ్ఞలు విధించి కనీసం నివాళులు అర్పించకుండా అడ్డుకున్నారని అన్నారు. పలు గ్రామాలకు రోడ్ల విషయంలో కేంద్రంతో మాట్లాడి అనుమతులు సాధిస్తామని అన్నారు.గిరిజనుల బతుకులు మార్చేది ఎప్పుడు..?అడవులను నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని గిరిజన సంఘాల నేతలు అన్నారు. గిరిజన అమరవీరుల ఆశయాలు సాధించాలంటే కుటుంబానికి 5 ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం, సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలకులు మారిన తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అడవుల నుండి ఆదివాసులను వెలగొట్టేందుకు పాలక ప్రభుత్వాలు కుట్ర పన్ను తున్నాయని ఆరోపించారు. కనీసం చేనులో బోర్ వెయ్యాలన్న అటవీ అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, రోడ్ల సౌకర్యం లేక అనేక అవస్థలు పడుతున్నామని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు వెడమ బొజ్జు, ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండెవిటల్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, మాజీ ఎంపీ సోయంబాపు రావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు,ఆదివాసీ సంఘాల నేతలు జగ్గారావు, దుర్గ మేడి , ఖిల్ మహాజన్, ఏఎస్పీ కాజల్ పాల్గొన్నారు.

## సీఎంకు రేవంత్‌కు రైతు గోడు పట్టదా? : బండి సంజయ్

పెద్దపల్లి, : రాష్ట్రంలో రైతులంతా అల్లాడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటన పేరుతో విదేశాలకు వెళ్లడమేంటని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఆదివారం పెద్దపల్లిలోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అకాల వర్షాలు కారణంగా నష్టపోయినరైతులను ఆదుకోవాలని మంత్రులకైనా ఆదేశాలివ్వాలని సూచించారు.
వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దారుస్సలాంలో జరిగిన బహిరంగ సభ ముమ్మాటికీ కాంగ్రెస్ స్పాన్సర్డ్ కార్యక్రమమేనన్నారు. వక్ఫ్ ఆస్తులను దోచుకున్న బడా చోర్లంతా కలిసి మీటింగ్లో పాల్గొని బీజేపీపై విషం చిమ్ముతున్నారని, మజ్లిస్ నేతలు విష సర్పాల కంటే డేంజర్ అన్నారు. ముస్లిం ఓట్లను దండుకుని ముస్లింలను ఆదుకోకుండా వక్ఫ్ ఆస్తులను దోచుకుతింటున్నారని మండిపడుతున్నారు.
అది కాంగ్రెస్ సౌజన్యంతో జరిగిన సమావేశందారుస్సలాంలో శనివారం మజ్లిస్ ఏర్పాటు చేసిన బహిరంగ సభ ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ సౌజన్యంతోనే జరిగిందని, వాటికి నిధులు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమకూర్చిందని బండి అన్నారు. అంబేద్కర్ పెట్టిన భిక్షవల్లే ప్రధాని కాగలిగానని నిండు పార్లమెంట్ లో ప్రకటించిన మహానేత నరేంద్రమోదీ అని, ఆయన ఆలోచనలను, ఆశయాలను సాధించేందుకు మోడీ నిరంతరం కృషి చేస్తున్న నాయకుడన్నారు.ఏటా లక్షా 25 వేల మంది దళితులను పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్న నేత అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో దళిత, బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన గొప్ప పార్టీ బీజేపీ అని, అంబేద్కర్ పేరును ఉచ్చరించే అర్హత కూడా ఒవైసీకి లేదన్నారు.పది లక్షల కోట్ల వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టారు!దేశంలో ఎనిమిది లక్షల ఎకరాలకు పైగా వక్ఫ్ ఆస్తులున్నాయని, వీటి విలువ 10 లక్షల కోట్ల రూపాయలకు పైమాటే అని, వీటిని సగానికిపైగా వక్ఫ్ బోర్డు ముసుగులో కొల్లగొట్టారని సంజయ్‌కుమార్ ఆరోపించారు.క్క తమిళనాడులోనే రూ.2 వేల కోట్ల విలువైన వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకున్నారన్నారు. తెలంగాణలో 77 వేల ఎకరాల వక్ఫ్ లాండ్స్ ఉంటే అందులో 80 శాతం భూములు ఈ దొంగలే స్వాధీనం చేసుకున్నారన్నారు. ఒవైసీ కుటుంబంతోపాటు మజ్లిస్ నాయకులు, సోకాల్డ్ వక్ఫ్ బోర్డు సభ్యులంతా వక్ఫ్ ఆస్తులను దోచుకుని ఆసుపత్రులు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు నిర్మించి కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోంది నిజం కాదా అని ప్రశ్నించారు. 77వేల ఎకరాల్లో ఒక్క గజం అయినా పేద ముస్లింలకు ఇవ్వలేదని, వక్ఫ్ ఆస్తులపై వచ్చే ఆదాయంలో ఒక్క రూపాయి అయినా పేద ముస్లింలకు ఖర్చు చేయడం లేదన్నారు. ఐదు లక్షల కోట్ల రూపాయల విలువైన వక్ఫ్ ఆస్తుల్లో పేద ముస్లింలకు కేటాయించిందెంత అని, ఆ ఆస్తులపై వచ్చే ఆదాయంలో వాళ్ల కోసం ఖర్చు చేసిందెంత లెక్కలు చెప్పాలని నిలదీశారు. హైడ్రాను ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వక్ఫ్ ఆస్తులపై విచారణ జరిపించే దమ్ముందా అని ప్రశ్నించారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీ వెంకటేష్ నేత, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపితో టిఎంసి కుమ్మక్కు.. అందుకే హింసాకాండ చెలరేగింది

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలో ఇటీవలి మత కల్లోలాలపై న్యాయ విచారణ నిర్వహించాలని సిపిఐ (ఎం) కోరింది. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ లబ్ధి పొందేందుకు అధికార టిఎంసి, ప్రతిపక్ష బిజెపి హింసాకాండ జరిపించేందుకు కుమ్మక్కు అయ్యాయని పార్టీ ఆరోపించింది. కోల్‌కతాలో బ్రిగేడ్ పరేడ్ మైదానంలో సిపిఐ (ఎం) అనుబంధ సంస్థల మెగా ర్యాలీని ఉద్దేశించి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు మొహమ్మద్ సలీమ్ ప్రసంగిస్తూ, నిరుద్యోగిత, ధరల పెరుగుదల, అవినీతి వంటి తీవ్ర సమస్యలపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆ రెండు పార్టీలు 'పోటీ మతతత్వం'లో నిమగ్నమయ్యాయని ఆరోపించారు.
'వాస్తవాన్ని వెలుగులోకి తేవడానికి ముర్షిదాబాద్ అల్లర్లపై న్యాయ విచారణను కోరుతున్నాం. టిఎంసి, బిజెపి పోటాపోటీగా మతతత్వం ప్రచారంలో నిమగ్నమయ్యాయి. సామాన్య ప్రజలను వేధిస్తున్న సిసలైన సమస్యలసపై నుంచి దృష్టి మరల్చేందుకు ఉద్దేశపూర్వక ఎత్తుగడే తప్ప మరేమీ కాదు' అని సలీమ్ అన్నార. కేంద్రం తీసుకువచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టం గురించి సలీమ్ ప్రస్తావిస్తూ, బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. అది ప్రజలకు నమ్మకద్రోహం చేస్తోందని ఆయన ఆరోపించారు. 'ఆ చట్టాన్ని (వక్ఫ్ సవరణ చట్టాన్ని) దేశవ్యాప్తంగా సవరించారు. దానిపై



దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. కానీ అల్లర్లు ముర్షిదాబాద్‌లో మినహా మరి ఎక్కడా జరగలేదు. అది తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతోంది' అని ఆయన పేర్కొన్నారు. 2026 ఎన్నికలకు ముందు వోటర్లను మతపరంగా విభజించేందుకు బిజెపి, టిఎంసి 'పరస్పరం సాయంచేసుకుంటున్నాయి' అని సలీమ్ ఆరోపించారు.

## హిందువులకు ఒకే ఆలయం, ఒకే బావి ఉండాలి: మోహన్ భగవత్

%అలీఘఢ్: దేశంలోని హిందువులకు ఒకే ఆలయం , ఒకే బావి ఉండాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్ ) అధినేత మోహన్ భగవత్ పిలుపు నిచ్చారు. హిందువులంతా కలిసికట్టుగా ఉండాలి. మతపరమైన సామరస్యాన్ని పెంపొందింపచేయాలని ఆయన కోరారు. అంతా కలిసి ఒకే గుడికి వెళ్లాలి. ఒకే జలాశయానికి వెళ్లి మంచినీరు తీసుకోవాలని, అప్పుడే వారి మధ్య ఉండాల్సిన సోదర బంధం ఇనుమడిస్తుందని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీఘఢ్‌లో ఆయన ఐదు రోజుల పర్యటనకు ఆదివారం వచ్చారు. ఐక్యతకు ప్రతీక దేవుడు, జలం, మరణానంతర అంత్యక్రియలు ఇవన్నీ కూడా సామూహికంగా జరగాల్సి ఉంది. హిందూ సమాజానికి విలువలు, సంస్కారం కీలకం, సాంప్రదాయం, సాంస్కృతిక విలువుల , నైతిక సూత్రాల మూలాలు ఉన్న సామాజిక వ్యవస్థ నిర్మాణంలో అంతా పాలుపంచుకోవల్సి ఉంటుందని స్పష్టం చేశారు. స్వయం సేవకులను ఉద్దేశించి ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. సమైక్యత , సామరస్య మూల సిద్ధాంతాలను ఇంటిలోనూ బయట ఎప్పటికప్పుడు తమ సందేశం వెలువరిస్తూ ఉండాలి, ఆచరిస్తూ ఉండాలని కోరారు. సమాజానికి నిర్మాణాత్మక శక్తిగా స్వయం సేవక్‌ల బృందం ఉంటుందని తెలిపారు. పండుగలు వస్తే సామూహికత ఉట్టిపడాల్సి ఉంటుంది. జాతీయవాదం, సామాజిక సహజీవన లక్షణాలు అణువణువునా ద్యోతకం కావల్సి ఉందని చెప్పారు.

# పాకిస్థాన్‌లో హిందూ మంత్రిపై దాడి

లాహోర్ : పాకిస్థాన్‌లో నిరసన ప్రదర్శనల దశలోనే ఓ హిందూ మంత్రిపై అల్లరిమూకలు దాడి జరిపాయి. దేశంలోని దక్షిణ ప్రాంతంలోని సింధులో ఇరిగేషన్ క్రాలువ పనుల విషయంలో నిరసనలు చెలరేగాయి. మత వ్యవహారాల సహాయ మంత్రి అయిన కియాల్ దాస్ కొహిస్థానీ ఈ ప్రాంతంలో ఉండగా నిరసనకారులు ఆయనను గుర్తించి, ఆయనపై టొమాటలు , ఆలుగడ్డలతో దాడికి దిగారు. దీనితో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. మంత్రి తమ కాన్వాయ్‌తో ఈ ప్రాంతంలో సంచరిస్తూ ఉండగానే నిరసనకారులు ఆయనను టార్గెట్ చేసుకున్నారని వార్తా సంస్థలు తెలిపాయి. సింధ్‌లోని థట్టా జిల్లాలో జరిగిన ఘటనలో ఆయన ఎటువంటి గాయాలు లేకుండా తప్పించుకోగలిగారు. మంత్రివర్గ సహచరుడిపై దాడిని పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఖండించారు.

## షేక్ హసీనా కోసం ఇంటర్ పోల్ సాయం కోరిన బంగ్లాదేశ్

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను స్వదేశానికి రప్పించేందుకు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న హసీనాను అప్పగించాలంటూ ఇప్పటికే పలుమార్లు భారత్‌ను కోరిన బంగ్లాదేశ్... తాజాగా అంతర్జాతీయ పోలీసు సంస్థ (ఇంటర్‌పోల్) సహాయాన్ని అర్థించింది. హసీనాతో పాటు మరో 11 మందిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని బంగ్లాదేశ్ ఇంటర్‌పోల్‌కు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం.గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో తీవ్ర హింసాత్మక ఘటనలు చెలరేగిన నేపథ్యంలో షేక్ హసీనా ప్రధాని పదవి నుంచి వైదొలగి, పొరుగున ఉన్న భారతదేశానికి వచ్చారు. అప్పటి నుంచి ఆమె ఇక్కడే ఉంటున్నారు. ఆమె అధికారం కోల్పోయిన తర్వాత, కొత్తగా ఏర్పడిన మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాపై వందలాది కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో విచారణ నిమిత్తం ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు కోరుతున్నాయి.ఈ క్రమంలోనే, బంగ్లాదేశ్ నేషనల్ సెంట్రల్ బ్యూరో (ఎన్సీబీ) తాజాగా ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించినట్లు అక్కడి స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు పలువురు మాజీ క్యాబినెట్ మంత్రులు, సలహాదారులు, సైనిక, పౌర అధికారులతో కలిపి మొత్తం 12 మందిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలని బంగ్లాదేశ్ కోరినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి.అంతకుముందు, బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ షేక్ హసీనాతో మారణహోమం' వంటి తీవ్రమైన అభియోగాల కింద అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది.

## గ్రహశకలం ఢీ కొంటే.. ఇండియాలో నాశనమైయ్యే నగరాలు ఇవే!

తొలుత ఈ గ్రహశకలం భూమిని ఢీ కొట్టే అవకాశం తక్కువగానే ఉందని అంచనా వేశారు. కానీ, వారం వ్యవధిలోనే అది 2.3 శాతనికి పెరిగింది.ఇక ఇప్పుడు తాజా నివేదికల ప్రకారం.. ఈ వైఆర్4 గ్రహశకలం భూమిని ఢీ కొట్టే అవకాశం 3.1 శాతంగా ఉందని నాసా తెలిపింది. అంటే క్రమక్రమంగా భూమికి ముప్పు వచ్చే ఛాన్స్ పెరుగుతుందని అర్థం. అలాగే యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ సైతం 2.8 శాతంగా అంచనా వేసింది. చూసేందుకు చాలా తక్కువ సంఖ్యలోనే ప్రమాదం సంభవించే అవకాశం కనిపిస్తున్నా.. అవి చాలా విధ్వంసాన్ని సృష్టించే అవకాశం ఉంది. వచ్చే నెల అంటే మార్చ్‌లో అత్యంత శక్తివంతమైన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా నాసా శాస్త్రవేత్తలు ఆ గ్రహశకలాన్ని పరిశీలించనున్నారు. ఈ పరిశీలనతో గ్రహశకలం పరిమాణం, దాని వేగంపై మరింత కచ్చితమైన సమాచారం లభించనుంది. ఇక వేళ 2024 %=%4 భూమిని ఢీకొంటే, ఫలితాలు విపత్కరంగా ఉంటాయి. గంటకు 40,000 మైళ్ల వేగంతో కదులుతూ, ఆ గ్రహశకలం ఎనిమిది మెగాటన్ల %చీ% పేలుడు శక్తిని ఉత్పత్తి చేయగలదు. పెద్ద పెద్ద నగరాలను నేలమట్టం చేస్తూ, ఊహించలేని వినాశనాన్ని మిగుల్చుతుంది. ఇది భూ గ్రహం మొత్తాన్ని అంతం చేయలేదు కానీ, పలు దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.ప్రస్తుతం అది తిరుగుతున్న కక్ష్య ఆధారంగా అది భూమిని ఈ వైపు ఢీ కొట్టుంది, ఏఏ దేశాలు ముప్పుకు గురయ్యే ప్రమాదం ఉంది, అందులోనూ మరీ ముఖ్యంగా ఏఏ నగరాలకు ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని కూడా సైంటిస్టులు వెల్లడించారు. తూర్పు పసిఫిక్, ఉత్తర దక్షిణ అమెరికా, అట్లాంటిక్ మహాసముద్రం, ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలు, అరేబియా సముద్రం, దక్షిణ ఆసియాపై ప్రభావం పడుతుంది. దక్షిణ ఆసియాలో ఉన్న ఇండియాపై కూడా గ్రహశకల ప్రభావం పడనుంది. ఇండియాలోని ముంబై, కోల్‌కతా నగరాలతో పాటు బంగ్లాదేశ్‌లోని ఢాకాపై గ్రహశకలం సృష్టించే విధ్వంసం ప్రభావం చూపనుంది. దాదాపు 110 మిలియన్లకు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. ఎందుకంటే.. ఈ ప్రాంతాలన్ని భారీ జనసాంద్రత కలిగిన ప్రాంతాలే

## ఆర్టీసీలో త్వరలోనే 3038 ఉద్యోగాలకు నోటిఫికేషన్

%అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) %- 23
%సెక్షన్ ఆఫీసర్ ( సివిల్) -11
అకౌంట్ ఆఫీసర్స్ %- 6
%మెడికల్ ఆఫీసర్స్ జనరల్ %- 7
%మెడికల్ ఆఫీసర్స్ స్పెషలిస్ట్ %- 7
%ఇప్పటికే ప్రజా పాలన ప్రభుత్వం లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తూ దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. ఇప్పుడు మరోసారి భారీస్థాయిలో ఉద్యోగాల నోటిఫికేషన్లు క్యాలండర్ ప్రకారం విడుదల చేయనుందని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని బాగా ప్రిపేర్ కావాలని సూచించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ జరుగుతుండడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకి మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## అంగారకుడిపై మిస్టరీ శిల!

అంగారక గ్రహంపై పరిశోధనలు చేస్తున్న అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా)కు చెందిన పెర్సెవరెన్స్ రోవర్ ఒక వింత ఆకారాన్ని గుర్తించింది. చూడటానికి అచ్చం మనిషి పుర్రెలా కనిపిస్తున్న ఓ రాయి చిత్రాన్ని రోవర్ భూమికి పంపింది. 'స్కల్ హిల్' (పుర్రె కొండ) అని నాసా నామకరణం చేసిన ఈ రాయి పుట్టుకపై ప్రస్తుతం అనేక ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.
నాసా పెర్సెవరెన్స్ రోవర్ అంగారకుడిపై ఉన్న జెజెరో బిలం అంచున తన పరిశోధనలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 11న రోవర్‌లోని శక్తివంతమైన మాస్ట్‌క్యామ్-జెడ్ కెమెరాకు ఒక ప్రత్యేకమైన రాయి కనిపించింది. ఆ ప్రాంతంలోని మిగతా రాళ్లు, నేల లేత రంగులో ఉండగా, ఈ రాయి మాత్రం ముదురు రంగులో, కోణాలతో, ఉపరితలంపై చిన్న చిన్న గుంతలతో విభిన్నంగా ఉంది. దీని ఆకారం పుర్రెను పోలి ఉండటంతో నాసా శాస్త్రవేత్తలు దీనికి 'స్కల్ హిల్' అని పేరు పెట్టారు.ఈ 'పుర్రె శిల' ఎలా ఏర్పడిందనే దానిపై స్పష్టత లేదు. "ఈ రాయి దాని చుట్టూ ఉన్న లేత రంగు ప్రాంతానికి భిన్నంగా ముదురు రంగులో, కోణాలతో కూడిన ఉపరితలంతో, కొన్ని గుంతలతో ప్రత్యేకంగా నిలుస్తోంది" అని నాసా ఒక ప్రకటనలో వివరించింది. ఈ రాయిపై ఉన్న గుంతలు గాలి వలన ఏర్పడిన కోత వల్ల లేదా అందులోని చిన్న చిన్న ఖనిజాలు కాలక్రమేణా తొలగిపోవడం వల్ల ఏర్పడి ఉండవచ్చని నాసా భావిస్తోంది.మరోవైపు, ఇది సమీపంలోని ఏదైనా అగ్నిశిల భాగం కావచ్చని, లేదా గతంలో ఏదైనా గ్రహశకలం ఢీకొన్నప్పుడు ఎగిరివచ్చి ఇక్కడ పడిన ముక్క అయి ఉండవచ్చని కూడా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. స్కల్ హిల్' రాయి రంగు, గతంలో క్యూరియాసిటీ రోవర్ గేల్ బిలంలో కనుగొన్న ఉల్కలను పోలి ఉందని నాసా బృందం అభిప్రాయపడింది.ప్రస్తుతం నాసా శాస్త్రవేత్తల బృందం ఈ 'స్కల్ హిల్' రాయి ఎక్కడి నుంచి వచ్చింది, దాని పుట్టుకకు కారణాలు ఏంటి అనే విషయాలపై లోతైన పరిశోధనలు చేస్తోంది. ఈ రాయిని విశ్లేషించడం ద్వారా అంగారకుడి భౌగోళిక చరిత్ర, అక్కడి వాతావరణ మార్పుల గురించి మరిన్ని కీలక వివరాలు తెలుసుకునే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అంగారకుడిపై జీవం ఆనవాళ్ల కోసం జరుగుతున్న అన్వేషణలో భాగంగా ఇలాంటి వింతైన ఆకారాలు, రాళ్ల అధ్యయనం కీలక పాత్ర పోషిస్తుంది.

## మీరు చూపిన అభిమానం, ఆప్యాయతతో మనసు ఉప్పొంగింది: సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు చూపిన అభిమానం, ఆప్యాయతతో మనసు ఉప్పొంగిందంటూ ట్వీట్ చేశారు."నా పుట్టినరోజున మీరు అందించిన శుభాకాంక్షలు, మీరు చూపించిన అభిమానం, ఆప్యాయతతో నా మనసు ఉప్పొంగింది. ఇప్పటివరకు నా ప్రయాణంలో నాకు తోడుగా నిలిచినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు.75 ఏళ్ల నా జీవన ప్రయాణంలో, 47 ఏళ్ల నా రాజకీయ ప్రస్థానంలో నాకు ఎల్లప్పుడూ తోడునీడగా ఉండి, నన్ను ముందుకు నడిపించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రజాసేవ చేసేందుకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చిన తెలుగు ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇది ఎవరికీ దక్కని అరుదైన గౌరవం%ౌ% అపురూప అవకాశం.మీ ఆదరాభిమానాలు, నాపై మీరు ఉంచిన నమ్మకం నాలో బాధ్యతను, నిబద్ధతను మరింత పెంచాయి. తెలుగు సమాజ పురోగతి కోసం అలుపులేకుండా పనిచేసేలా మీరంతా నాలో ఉత్సాహం నింపారు. మీ భవిష్యత్ కలలు, ఆకాంక్షలను సాకారం చేయాడానికి నిరంతరం కష్టపడి పనిచేస్తానని మాటిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి కోసం, తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం పునరంకితమవుతానని నా జన్మదినం రోజున వినమ్రంగా తెలియజేస్తున్నాను.స్వర్ణాంధ్ర-2047 విజన్ మీ అందరి ఆకాంక్షల సమాహారం. మీ మద్దతుతో, మీ సహకారంతో, సమిష్టి కృషితో ఆ కలను నిజం చేస్తాను. నా ప్రతీ అడుగు, నా ప్రతీ ఆలోచన, ప్రతీ కార్యక్రమం మీ ఉజ్వల భవిష్యత్తు కోసమే. అందరికీ అవకాశాలు కల్పించేలా, ప్రతి పౌరుడి భవిష్యత్తుకు భరోసా నిచ్చేలా పాలన అందిస్తాను.ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ ఆవిష్కరణలకు , అవకాశాలకు కేంద్రంగా మలచాలనేది నా తపన. 'థింక్ గ్లోబల్లీ-యాక్ట్ గ్లోబల్లీ' విధానంతో రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దుకుందాం . సమాజంలో అసమానతలు పోవాలి. పేద-ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గాలి. పేదరికం లేని సమాజం స్థాపించాలనేదే నా సంకల్పం.అందుకే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం%ౌ% మూడు దశాబ్దాల నాడు నేను ప్రవేశపెట్టిన 'జన్మభూమి' సమాజంలో ఎంతో మార్పుతెచ్చింది. ఈసారి తీసుకువచ్చిన 'పీ4'తో రాష్ట్రంలో పేద కుటుంబాలను%ౌ% స్వర్ణ కుటుంబాలుగా చేయాలనేది నా ప్రయత్నం. ప్రతి సంపన్న వ్యక్తి పేదవాడి శ్రేయస్సు కోసం పాటుపడాలి. వ్యక్తి శ్రేయస్సే%ౌ% సమాజ శ్రేయస్సుగా నేను విశ్వసిస్తాను. జనం మన బలం%ౌ% జనాభా సమర్ధ నిర్వహణ ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చు.ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు సాధిస్తున్న విజయాలు మనకెంతో గర్వకారణంగా నిలుస్తున్నాయి. అత్యధిక తలసరి ఆదాయం ఆర్జిస్తున్నవారిలో ముందువరుసన ఉన్నాం. మనం కలిసికట్టుగా పనిచేస్తే మరిన్ని తిరుగులేని విజయాలు సాధించగలం. 2047 నాటికి ప్రపంచంలోనే శక్తివంతమైన జాతిగా తెలుగు జాతిని నిలపాలన్నదే నా అభిలాష.ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం తెలుగు ప్రజల రక్తంలోనే ఉంది. దేశభక్తి చాటేలా వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు చేయిచేయి కలుపుదాం. నాతో పాటు, అందరూ ఇందులో భాగస్వాములు అయ్యేలా ఆహ్వానిస్తున్నాను.నా పుట్టినరోజు సందర్భంగా మారుమూల పల్లె నుంచి దేశ, విదేశాల వరకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు, ప్రజలకు%ౌ%.అందరికీ మరోసారి ధన్యవాదాలు.



# మంత్రి పదవి రాకపోతే రాజీనామా చేస్తా

-తన పేరులోనే ఉన్న జిల్లాకు ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్

-జిల్లాలో ఎవరికైనా ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలి

- మల్ రెడ్డి రంగారెడ్డి.

**సాయి సూర్య-రంగా రెడ్డి బ్యూరో:తెలంగాణ** కేబినెట్ విస్తరణ ఇప్పట్లో ముగిసిపోయే అంశం కాదు. అధిష్టానం తొందరగా తేల్చకపోవడంతో రోజురోజుకు ఉత్కంఠతో పాటు...ఆశావహుల నుంచి వ్యతిరేకత ఎక్కువైపోతోంది. ఐతే మంత్రి పదవి కోసం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయా అంశం అయ్యాయి. పదవి రాకపోతే...రాజీనామా చేస్తానంటూ హెచ్చరించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం నాలుగు జిల్లాల నుంచి ప్రాతినిధ్యం ఉంది. అందులో ఉమ్మడి జిల్లాల పరంగా చూస్తే... ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు, నల్గొండ జిల్లా నుంచి ఇద్దరు, కరీంనగర్ నుంచి ఇద్దరు, వరంగల్ నుంచి ఇద్దరు ఉన్నారు. మొత్తం ముఖ్యమంత్రి తో కలిపి 12 మంది ఉన్నారు. ఇంకా ఆరు బెర్తులు ఖాళీ ఉన్నాయి. ఐతే ఈ ఆరు బెర్తుల కోసం పోటీ నెలకొంది..పదవులు ఇవ్వకపోతే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తామని ఒకరు, సీఎంనే దించేస్తామని ఇంకొకరు ఇలా ఎవరికి వారు వార్నింగ్ ఇచ్చేస్తున్నారు. ఐతే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు మాత్రం... లోచింపజేశాయి. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే రాజీనామా చేస్తాం అనడం అనే హెచ్చరిక పక్కకు పెడితే.. రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరడంలో తప్పు లేదని రాజకీయ విశ్లేషకులు, ఆ పార్టీ సీనియర్ నేతలే చెప్తున్నారు. అంతేకాదు ఉమ్మడి పది జిల్లాల నేతలకు పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, వేణుగోపాల్ ను కలిసి కోరినట్టు తెలిపారు.

గతంలో లేఖ కూడా రాశామని చెప్పారు. ఐతే తనకు మంత్రి పదవి ఇవ్వకపోవడానికి సామాజిక వర్గం అడ్డొస్తే..తప్పుకుంటానని.. ఏ కులం వారికి ఇస్తారో చెప్తే.. తాను రాజీనామా చేసి.. ఆ సామాజిక వర్గం నేతను ఎమ్మెల్యేగా గెలిపించుకునే బాధ్యత తనదే అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఏదో ఒక సామాజిక వర్గానికి పదవి దక్కాలని ఆశించారు. రంగారెడ్డి జిల్లాలో నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలంటే..ఎవరో ఒకరు ఈ జిల్లా నుంచి మంత్రి ఉండాలని ఆయన అంటున్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలు.. పార్టీ భవిష్యత్తును ఆలోచించి చేసినవే.. జిల్లాలో క్యాడర్, ప్రజా ప్రతినిధులను కాపాడుకోవాలంటే, వచ్చే ఎన్నికల్లో మరోసారి గెలవాలి అంటే.. బలమైన నేతతో పాటు, మంత్రి పదవులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఐతే సీనియర్ నేత జానారెడ్డి కూడా రంగారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం ఇవ్వాలని అధిష్టానానికి లేఖ రాశారు. మల్ రెడ్డి రంగా రెడ్డి వ్యాఖ్యలను పార్టీ ఎంత మేరకు పరిగణనలోకి తీసుకుంటుందో చూడాలి. ఇప్పటివరకు నేతలంతా దిల్లీలో పైరవీలు చేస్తూనే ఉన్నారు. మరి అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో చూడాలి.

# ప్రపంచంలో అతి పెద్ద శరణార్థి శిబిరంపై ట్రంప్ నిర్ణయాల ప్రభావం ఎలా ఉందంటే...









"ఆ రోజు, మా ఊరి మీద విపరీతంగా బాంబులు వేశారు. బాంబు శకలం ఒకటి నా మూడేళ్ల కొడుకు తొడలో గుచ్చుకుంది. స్పృహ కోల్పోయాడు. వాడిని డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లలేకపోయాము. గాయాలను ఆకులతో కప్పి, చుట్టూ బట్ట చుట్టాము. ఆ తర్వాత సరిహద్దుల్ని దాటి బంగ్లాదేశ్‌లోకి వచ్చాం. ఇక్కడే వైద్యం అందింది"మాటలలో నిస్సహాయత, ఆవేదనను వ్యక్త పరుస్తూ, తన కుమారుడికి ప్రాణాంతకంగా మారిన బాంబు శకలం ఫోటోను బీబీసీకి చూపించారు ఇస్మత్ అరా.ఆమెతో పాటు లక్షల మంది శరణార్థులు బంగ్లాదేశ్‌లోని కాక్సస్ బజార్‌లో వెదురు బొంగులు, టార్పాలిన్ పట్టాలతో వేసిన తాత్కాలిక టెంట్లలో జీవిస్తున్నారు.ఏడు నెలల కిందట, మియన్మార్‌లోని మౌంగ్డా ప్రాంతంలో ఉన్న సొంత ఇంటిని వదిలేసి ఇస్మత్ అరా తన కుటుంబంతో సహా బంగ్లాదేశ్‌కు పారిపోవాల్సి వచ్చింది.ప్రపంచంలో ఎక్కువగా హింసను ఎదుర్కొంటున్నారని ఐక్యరాజ్య సమితి చెబుతున్న రోహింజ్యా కమ్యూనిటీకి చెందినవారు ఇస్మత్ అరా. ఈ కమ్యూనిటీలో ఎక్కువమంది ముస్లింలు.ఆమె ప్రస్తుతం కాక్సస్ బజారులో ఏర్పాటు చేసిన 34 క్యాంపుల్లోని ఓ క్యాంపులో ఉంటున్నారు.బంగ్లాదేశ్‌లోని ఈ ప్రాంతం పది లక్షల మందికి పైగా శరణార్థులకు ఆశ్రయం ఇస్తోంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద శరణార్థి శిబిరమని ఐక్యరాజ్యసమితి చెబుతోంది.2021లో సైన్యం మియన్మార్‌లో అధికారాన్ని చేపట్టింది. ఆ తర్వాత దేశంలో అంతర్యుద్ధం మొదలైంది. వాస్తవానికి రఖైన్ రాష్ట్రంలోని రోహింజ్యాలు కొన్ని దశాబ్దాలుగా అణచివేత, హింసను ఎదుర్కొంటున్నారు.2016 అక్టోబర్‌లో 'అరాకన్ రోహింజ్యా సాల్వేషన్ ఆర్మీ' పేరుతో ఏర్పాటైన ఒక టెర్రరిస్టు గ్రూపు, ఈ ప్రాంతంలోని కొన్ని పోలీస్ కేంద్రాల మీద దాడి చేసింది. 9 మంది అధికారులను చంపేసింది.దీనికి స్పందించిన సైన్యం ప్రతీకార చర్యలకు దిగింది. ఈ సమయంలో మియన్మార్ సైన్యం హత్యలు, అత్యాచారాలు, చిత్రహింసలకు పాల్పడిందనే ఆరోపణలు వచ్చాయి. తాము తీవ్రవాదుల్ని లక్ష్యంగా చేసుకున్నామని, పౌరులను కాదని సైన్యం వివరణ ఇచ్చింది.

దీని ఫలితంగా 2017 ఆగస్టులో మియన్మార్‌లో దాదాపు 700 మంది రోహింజ్యా ముస్లింలు తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. దీనిని భరించలేని పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌కు పారిపోయారు. ఆ వలస ఇప్పటికీ కొనసాగుతోంది.సరిహద్దుల్లో ఉన్న మియన్మార్ రాష్ట్రం రఖైన్ నుంచి ఇప్పటికీ వేలమంది బోర్డర్ దాటి బంగ్లాదేశ్‌లోకి వస్తున్నారు. రెండు దేశాల మధ్య ఉన్న నఫ్ నది, కొన్నిసార్లు సముద్ర మార్గాల్లో చిన్న పడవల మీద ప్రయాణిస్తూ, మరి కొందరు అడవుల్లో ప్రమాదకరమైన మార్గాల గుండా ప్రయాణిస్తూ బంగ్లాదేశ్ చేరుకుంటున్నారు.మీద దాడి 'జాతి హననం' అని ఐక్యరాజ్య సమితి అభివర్ణించింది.

ఈ సంఘటనలపై విచారణ తర్వాత, మియన్మార్ సైనిక జనరల్, అప్పటి అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లాయింగ్ మీద అరెస్ట్ వారెంట్ జారీ చేయాలని అంతర్జాతీయ నేర న్యాయ స్థానం ప్రాసిక్యూషన్ కోరింది. రోహింజ్యాల మీద జరిగిన దాడులకు ఆయనే బాధ్యుడని విచారణలో తేలింది.

గతేడాది కూడా 60వేల మంది రోహింజ్యాలు బంగ్లాదేశ్‌లో ఆశ్రయం పొందారని బంగ్లాదేశ్ ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.ఈ క్యాంపుల్లో ప్రతీ ఏటా 30వేల మంది పుడుతున్నారని, కాక్సస్ బజారులో శరణార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు.రోహింజ్యా శరణార్థులు బంగ్లాదేశ్‌లో పని లేదా ఉద్యోగం చేసేందుకు స్థానిక చట్టాలు అంగీకరించవు. అంతే కాకుండా వాళ్లు విద్య, వైద్యం కోసం క్యాంపుల్ని వదిలి వెళ్లడానికి అవకాశం లేదు.

ఆహారం, దుస్తులు, భవన నిర్మాణ సామగ్రి, వైద్య సేవలు, స్కూళ్లు ఇలా అన్నింటికీ స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే విరాళాల మీదనే శరణార్థులు ఆధారపడాలి.డోనల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడైన తర్వాత యూఎస్ ఎయిడ్ ద్వారా ఇస్తున్న నిధులను నిలిపేశారు. దీంతో శరణార్థుల పరిస్థితి మరింత క్షీణించింది. 2017 నుంచి కాక్సస్ బజారులో పిల్లల్లో పోషకాహార లోపం చాలా తీవ్రంగా ఉందని ఐక్యరాజ్య సమితి బాలల నిధి సంస్థ తెలిపింది.తమకు నిధులు అందడం లేదని, అందుకే రోహింజ్యా క్యాంపులకు ఇస్తున్న ఆహార సరఫరాలను సగానికి తగ్గించామని, శరణార్థులకు ఆహారం అందించేందుకు ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ వెల్లడించింది.శరణార్థుల కనీస అవసరాలకు సరిపడా వస్తువుల్ని సరఫరా చేస్తున్న అనేక సంస్థల కార్యక్రమాలు ఆగిపోవడాన్ని బీబీసీ గుర్తించింది.మూత పడ్డ వైద్య కేంద్రాలు, దూరం వెళ్లాలంటే డబ్బుల్లేవుకాక్సస్ బజారుకు దక్షిణంవైపు 80 కిలోమీటర్ల అవతల ఉన్న టెక్నాఫ్ ప్రాంతంలో 12 ఏళ్ల అన్వర్ సదేఖ్‌ను ది.ఆ బాలుడు నడవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. అంతేకాదు. మాట్లాడలేడు. వినపడదు కూడా.2017లో 9 మంది సభ్యులున్న ఆయన కుటుంబం మియన్మార్ నుంచి బంగ్లాదేశ్ వచ్చింది.వాళ్లందరూ గుడారాల్లోనే నివసిస్తున్నారు. అందులో కేవలం బల్బులు మాత్రమే ఉన్నాయి. ఫ్యాన్లుగానీ, మరుగుదొడ్డి వసతిగానీ లేదు. అక్కడ నాలుగు కుటుంబాలు ఒకే మరుగుదొడ్డిని వాడుకుంటున్నాయి." ఇంతకు ముందు ఇక్కడ మా పరిస్థితి కొంత మెరుగ్గా ఉండేది. మా అబ్బాయికి వైద్యం అందేది. కొన్ని రోజుల కిందట మా పిల్లాడిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లినప్పుడు క్లినిక్ మూసేసి ఉంది. నెల రోజులైంది, ఇంకా తెరవలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు." అని అన్వర్ తల్లి ఫాతిమా అక్తర్ చెప్పారు.హ్యాండీకాప్ ఇంటర్నేషనల్ నిర్వహిస్తున్న ఈ క్లినిక్‌కు తాళం వేసి ఉండటాన్ని బీబీసీ గుర్తించింది. అమెరికా ప్రభుత్వం నిధులు నిలిపివేయడం వల్ల తాము సర్వీసులను అందించలేకపోతున్నామని క్లినిక్ తలుపు మీద ఒక నోటీసు అంటించారు.


"స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధి ఒకరు క్యాంపులో ఉన్న నాలాంటి గర్భవతుల్ని తరచుగా వచ్చి చూసేవారు. మమ్మల్ని వైద్య కేంద్రానికి తీసుకెళ్లేవారు. అయితే నెల రోజుల నుంచి ఎవరూ రాలేదు. ఇప్పుడు వైద్యం కోసం మేము చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. మా దగ్గర డబ్బుల్లేవు. ఈ దేశం గురించి మాకు ఏమీ తెలియదు." అని సిన్వర్ అనే మహిళ చెప్పారు.ఆహార సరఫరాతో పాటు ఇతర సేవల్లోనూ కోత పడిందని క్యాంప్ నాయకుడు మొహమ్మద్ నూర్ అన్నారు."ప్రతి శీతాకాలంలో మాకు వేడినిచ్చే దుస్తులు అందేవి. రంజాన్ పండక్కి ఆహారం వచ్చేది. ఈసారి ఏమీ రాలేదు. అంతకు ముందు కూడా ఆహారం పరిమితంగానే అందేది. అదిప్పుడు ఇంకా తగ్గింది. మాకు మాస్కులు, శానిటైజర్లు, మందులు వచ్చేవి. క్యాంపుల్లో డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతుంటాయి. ఈ ఏడాది మాకు ఏమీ రాలేదు" అని ఆయన చెప్పారు.ఫొటో క్యాప్షన్,రోహింజ్యాల మీద దాడి 'జాతి హననం' అని ఐక్యరాజ్య సమితి అభివర్ణించింది.దీనికి పరిష్కారం ఉందా?ఈ విషయం తెలుసుకునేందుకు, బీబీసీ డేవిడ్ బుగ్డెన్‌ను కలిసింది. ఆయన కాక్సస్ బజార్‌లోని క్యాంపులు, వందకు పైగా ఎన్జీవో ప్రోగ్రామ్‌లకు సమన్వయకర్త. రోహింజ్యా రెఫ్యూజీ రెస్పాన్స్ బంగ్లాదేశ్ అనే సంస్థను నడుపుతున్నారు.ఇక్కడ అనేక సమస్యలు ఉన్నాయని ఆయన అంగీకరించారు."నిధులు తగ్గిపోవడం, అనేక సేవలపై ప్రభావం చూపించింది. వచ్చే ఏడాది మాకు వచ్చే నిధులు ఇంకా తగ్గిపోతాయి. ఇదిలాగే కొనసాగితే శరణార్థుల అవసరాలు, అందుకు అవసరమైన నిధుల మధ్య గ్యాప్ బాగా పెరుగుతుంది" అని ఆయన చెప్పారు."ప్రజల్లో అసహనం పెరిగితే వారు అనూహ్య నిర్ణయాలు తీసుకుంటారు. వాళ్లు ఇక్కడ నుంచి మరెక్కడికైనా వలస వెళ్లవచ్చు. భద్రత, నేరాలకు సంబంధించిన పరిస్థితులు అదుపు తప్పవచ్చు" అని డేవిడ్ చెప్పారు.

ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గ్యుటెరస్ కొన్ని రోజుల కిందట కాక్సస్ బజారును సందర్శించారు. ఆహార సరఫరాల్లో కోతపై స్పందిస్తూ ఇది ఎంత మాత్రం ఆమోదనీయం కాదన్నారు.

"ఈ ఏడాది శరణార్థులకు సాయం అందించాలంటే 93 కోట్ల అమెరికన్ డాలర్ల( సుమారు రూ. 8 వేలకోట్ల) సాయం అవసరం. ఆ నిధుల కోసం మేము త్వరలో ప్రపంచ దేశాలను అభ్యర్థిస్తాం. మేము అడిగితే 60 నుంచి 70శాతం నిధులు వస్తాయి. అయితే ఈ ఏడాది మాకు అంతగా నిధులు అందకపోవచ్చు." అని డేవిడ్ బుగ్డెన్ చెప్పారు.2023లో డేవిడ్‌కు సంబంధించిన సంస్థ 91 కోట్ల అమెరికన్ డాలర్ల (సుమారు రూ. 7800 కోట్లు) నిధుల కోసం విజ్ఞప్తి చేసింది. ఆ సంస్థకు 57 కోట్ల అమెరికన్ డాలర్ల (సుమారు రూ. 4900) సాయం అందింది. అంతకు ముందు ఏడాది 56 కోట్ల డాలర్లు(సుమారు రూ. 4800 కోట్లు) అందాయి.

# వర్షాకాలం రాకముందే ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాలను చుట్టేసిరండి..!





వర్షాకాలంలో ప్రయాణాలు చేయడం ఇష్టంలేని వారు అంతకుముందే ఈ అరుదైన ఆఫ్‌బీట్ డెస్టినేషన్లకు వెళ్లడానికి ట్రై చేయండి. ఇవి పశ్చిమ కనుమల్లో ఉండే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు.

అమెజాన్‌లో తక్కువ ధరకే స్మార్ట్ స్క్రీన్, గొప్ప పెర్ఫార్మెన్స్ చూపే టాప్ క్వాలిటీ టాబ్లెట్స్‌ను సొంతం చేసుకోండి

కొంత మంది పర్యాటకులు కొద్దిపాటి వర్షపాతం కనిపించినా తమ ప్రయాణ ఏర్పాట్లను పూర్తిగా రద్దు చేసుకుంటారు. అది వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా నిజమనే చెప్పాలి. వర్షాకాల ప్రయాణం చాలా అద్భుతంగా ఉంటుందని తెలిసినా కొందరు బయటకు వెళ్లలేరు. అయితే, అలాంటి ప్రయాణికులు వర్షాకాలం ప్రారంభమవ్వడానికి ముందే పశ్చిమ కనుమల్లోని ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాలను సందర్శించి రండి. ఎందుకంటే వర్షాకాలంలో ఆ ప్రదేశాలు ఎక్కువకాలం అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉండటంతో అంతకన్నా ముందే ఓ ట్రిప్ ప్లాన్ చేయడం మంచిది. మరోవైపు ప్రస్తుత సమయంలో ప్రకృతి కూడా కొత్త అందాలతో నిండి ఉంటుంది కాబట్టి ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవచ్చు.

**అగుంబే, కర్ణాటక..**

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో ఉండే అగుంబే అనే పర్యాటక ప్రదేశాన్ని దక్షిణ భారతదేశంలోని చిరపుంజీ అని పిలుస్తారు. ప్రస్తుతానికి రుతుపవనాలు చాలా దూరంగా ఉండటంతో వర్షం గురించి ఆలోచించే ప్రయాణికులు భయపడాల్సిన అవసరం లేదు. ఎంచక్కా ఫ్యామిలీతో విహరించి అక్కడి అరణ్య ప్రాంతాన్ని, చుట్టుపక్కల గ్రామాలను సందర్శించవచ్చు. ఈ ప్రదేశం గొప్ప ప్రకృతి అందాలు, సాంస్కృతిక అనుభవాలను కలిగి ఉంది. దీంతో వేసవిలో అక్కడ విహరించడానికి అద్భుతంగా ఉంటుంది.

**వట్టకనల్, తమిళనాడు..**

తమిళనాడులోని అద్భుతమైన పర్యాటక ప్రదేశాల్లో కొడైకెనాల్ ఒకటి. దానికి సమీపంలోనే ఉంటుంది ఈ వట్టకనల్ అనే మరో అందమైన ప్రదేశం. అక్కడి పరిసరాలన్నీ చాలా ఆహ్లాదకరంగా, అద్భుతంగా, అందంగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంలా అనిపిస్తుంది. చుట్టూ కొండలు, లోయలు, పచ్చిక బయళ్లు పర్యాటకుల మనసును హత్తుకునేలా ఉంటాయి. అక్కడ అద్భుతమైన హోమ్‌స్టేల సౌకర్యం కూడా అందుబాటులో ఉండటంతో ఎలాంటి బెరుకు లేకుండా హాలిడేని ప్లాన్ చేయొచ్చు.

**పొన్ముడి, కేరళ..**

కేరళలోని తిరువనంతపురం సమీపంలో ఉండే అందమైన హిల్‌స్టేషన్ పోన్ముడి. అక్కడ పొగమంచుతో కనిపించే అందమైన కొండలు, ఆశ్చర్యం కలిగించే ప్రకృతి దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. అలాగే అన్యదేశ సీతాకోకచిలుకలతో సహా పెద్ద మొత్తంలో అరుదైన వృక్ష, జంతుజాలం కూడా అలరిస్తాయి. ఏడాది పొడవునా అక్కడి ఉష్ణోగ్రతలు కూడా సాధారణంగా ఉండటంతో వేసవి టూరిస్ట్ స్పాట్‌గానూ పనికొస్తుంది. అలాగే కల్లార్ నది అందాలు, మీన్‌ముట్టి జలపాతం సవ్వడులు గొప్ప ఆహ్లాదాన్ని పంచుతాయి.

**పొల్లాచ్చి, తమిళనాడు..**

తమిళనాడులోని కోయంబత్తూర్‌కు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండే పొల్లాచ్చి సైతం మంచి ఆఫ్‌బీట్ డెస్టినేషన్. ఇది అన్నామలై పర్వత కొండల్లో ఉండే సుందరమైన ప్రదేశం. ముఖ్యంగా అక్కడ తేయాకు తోటలతో పాటు చెరుకు, ఇతర పంటలకు ప్రసిద్ధి చెందింది. సహజంగానే ఇది వ్యవసాయ ఆధారిత ప్రదేశం కావడంతో చూడచక్కని ప్రదేశాలు ఆకట్టుకుంటాయి. కొడైకెనాల్‌ను సందర్శించే వారు తప్పక ఈ పొల్లాచ్చిని కూడా సందర్శిస్తారు. దీంతో మీరూ ఈ రెండు ప్రదేశాలను ఒకే టూర్‌లో కవర్ చేసే వీలుంటుంది.

**చోర్లా ఘాట్స్, గోవా..**

కర్ణాటక, మహారాష్ట్ర, గోవా మూడు రాష్ట్రాలు కలగలిసే అరుదైన ప్రదేశం ఈ చోర్లా ఘాట్స్. ఇది గోవా రాజధాని పనాజీకి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రకృతి ఒడిలో అద్భుతమైన దృశ్యాలను కలిగి ఉంటుంది. సాధారణంగా గోవాకు వెళ్లేవారంతా బీచ్‌లు, అక్కడి చారిత్రక కట్టడాలనే చూసొస్తారు. ఈ చోర్లాఘాట్స్‌ను పెద్దగా పట్టించుకోరు. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో ఉండే ఈ అందమైన ప్రదేశానికి కార్ లేదా బైక్‌పై వెళ్లాలి. విశాలమైన పొలాలు, అందమైన సరస్సులు, పురాతన వంతెనల గుండా సాగే ఆ ప్రయాణం గోవా ట్రిప్‌ను మరో లెవెల్‌కు తీసుకెళుతుంది.

## పర్యాటకులను ఆకర్షిస్తున్న
# చందంపేట గుహలు..



గుహలు అనగానే మనకు బొర్రా గుహలు , బెలుం గుహలు గుర్తొస్తాయి. తెలంగాణలో అద్భుతమైన కళాసంపద మాత్రమే కాదు అత్యద్భుతమైన శిలా సంపద కూడా ఉన్నది.

పర్యాటకులను ఆకర్షిస్తున్న చందంపేట గుహలు.. మన తెలంగాణలోనే!




గుహలంటే బెలుం గుహలేనా? గుహలంటే బొర్రా గుహలేనా? వీటిని మించి మైమరిపించి ఆహ్లాదాన్ని పంచే గుహలు మన దగ్గర కూడా ఉన్నాయి. కానీ అవి సరైన గుర్తింపునకు నోచుకోలేదు. పర్యాటక ప్రదేశాలుగా పేరుగాంచలేదు. వసతులుంటే వనాల్లోనే ఉండి హాయిని పొందే గుహలు తెలంగాణలో కూడా ఉన్నాయి. వీలైతే చందంపేట గుహల వైపు ఓ రౌండేసి రండి.. ఎంతటి ఆనందం పొందుతారో మీరే చూడండి..తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి అందాలకు కొదువే లేదు. ఎత్తైన కొండలు, గలగలపారే జలపాతాలు అడవుల సంగతైతే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటితో పాటు దర్శనీయ స్థలాలు చాలానే ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి గుహలు . గుహలు అనగానే మనకు బొర్రా గుహలు , బెలుం గుహలు గుర్తొస్తాయి. తెలంగాణలో అద్భుతమైన కళాసంపద మాత్రమే కాదు అత్యద్భుతమైన శిలా సంపద కూడా ఉన్నది.

**చల్లని చందంపేట...** కృష్ణానదీ లోయలో నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఉండే అరుదైన గుహలున్నాయి. ఐస్‌లాండ్లోని ఒక అగ్నిపర్వతంలో కరిగి చిమ్మిన లావా వేడి,వేగాలకు ఏర్పడిన భూమికి 400అడుగుల లోతున వున్న దిహ్నుకగిగుర్ అనే గుహ ప్రకృతే స్వయంగా వేసిన హరివిల్లు రంగులతో ఏర్పడి ఉంది. నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని కాచరాజుపల్లికి దగ్గర వున్న గుట్టల వరుసలో మునులగుహగా పేరున్న గాజుబేడం గుహ ఆక్వామెరీన్ (నీలి ఆకుపచ్చ) రంగుతో మెరిసిపోతు కనపడుతుంది. గుహలోకి ప్రవేశించే మార్గం విశాలంగా ఉంటుంది. కళ్ళుచెదిరే రంగులగోడలు, అంతస్తుల గుహలు మనల్ని అబ్బురపరుస్థాయి. ఈ మునుల గుహ లేదా భావోజి గుహలో ఏర్పడిన గుహాంతర్భాగాలు సొరంగాలుగా, అంతస్తులుగా చక్కగా చెక్కినట్టుగా రాతిగోడలు, అందమైన ఆకృతులు ఒకచోట ఎరుపు రంగు, మరొకచోట కొంచెం నారింజవర్ణం, గుహలో 90 శాతం ఆక్వామెరీన్(నీలి ఆకుపచ్చ)రంగుతో చాలా అందంగా కనపడుతున్నాయి. ఈ రాతిగోడలు ఇలా రంగులతో మెరిసిపోతున్నాయంటే అగ్నిపర్వతంలో లావా ప్రవాహంతో ఇట్లాంటి గుహలు ఏర్పడివుంటాయి. లావావేడికి కరిగిన వివిధ ఖనిజాలు కలిసిపోవడంతో ప్రాకృతికంగా గుహలగోడలకు ఈ రంగులు వచ్చి ఉంటాయి .ఈ గుహలోని రాళ్ళు ఖనిజసంపన్నమైనవి. ప్రభుత్వం వీటిని పరీక్షించి వీటిలోని ఖనిజాలను అన్వేషించాలి. అంతేకాదు దేశంలోనే అరుదైన ఈ గుహలకు మంచిదారులు వేసి విహార యాత్రాస్థలంగా రూపొందించాలి.ప్రభుత్వం దృష్టిపెడితే ప్రతిష్టాత్మకంగా మారడమే కాక రేపటి పర్యాటక సంపదకు కూడా మూలకారణం అయ్యే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. గుహలోని మార్గాలను అన్వేషిస్తే అనేకమైన కొత్తసంగతులు, ఆశ్చర్యపరిచే చారిత్రక విశేషాలు బయటపడే అవకాశాలున్నాయి. సహజమైన అందాలు%ొ% పర్యాటకానికి అవసరమైన అన్ని హంగులనూ సొంతం చేసుకుంది చందంపేట మండలం.దేవరచర్లలోని పురాతన శివాలయంతో పాటు గాజు బేడం గుహలు, మునిస్వామి గుట్ట దగ్గర మునిస్వామి, ఏలేశ్వరంలో మల్లయ్యస్వామి ఆలయాలు పుష్కరాలకు వేదికలు. దేవరచర్ల సమీపంలోని మునిస్వామిగుట్టలో జలపాతం దగ్గరి శివలింగం ఆధ్యాత్మిక అనుభూతికి లోను చేస్తుంది. గాజు బెడం గుహలు కాచరాజుపల్లి అటవీప్రాంతంలో ఉన్నాయి. వైజాగ్ కాలనీ నుంచి కృష్ణానదిలో ప్రయాణిస్తే కొండల మధ్య కృష్ణా నది పరవళ్లు తీసే దృశ్యాలు పాపికొండలను తలపిస్తాయి.

**మైమరిపించే మైలారం...** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పాండవుల గుట్టకి చేరువలో ఉన్న మైలారం గుహలు లక్షల సంవత్సరాల నాటి ఆనవాళ్లకు, ప్రకృతి చెక్కిన అందాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. నల్లగుట్టలుగా పేరొందిన నల్లరాతి గుట్టలలో 3.5 కి.మీ. మేర ఈ సున్నపు గుహలు విస్తరించి ఉన్నాయి. ఇలాంటి గుహలు మన దేశంలో ఉత్తరాఖండ్, హర్యానా, మేఘాలయ, మధ్యప్రదేశ్ , చత్తీస్ ఘడ్, అండమాన్-నికోబార్ దీవులలో ఉన్నాయి. తెలంగాణలో ఉన్న సున్నపు గుహలు ఇవొక్కటే కావడం విశేషం. న్లగుట్టల్లో గుహల లోపలికి సహజసిద్ధంగా ఏర్పడిన సొరంగాలు, ఆ సొరంగాల్లో రహస్య మార్గాలు ఉన్నాయి.గుహల పై భాగంలోని సున్నపురాతి పైకప్పుల నుండి సున్నపునీటితో జారిపడి గట్టిపడిన స్టాలక్టైట్స్ , వాటితో ఏర్పడిన వింతైన ఆకృతులున్నాయి. పరిసర ప్రాంతాల్లో ప్రకృతి సోయగాలు, ఎన్నో అపురూప దృశ్యాలు మనల్ని అబ్బురపరుస్తాయి. ఈ గుట్టలను ఆదిమానవుల ఆవాసాలుగా చరిత్రకారులు భావిస్తున్నారు. అందుకు నిదర్శనంగా ప్రాచీన శిలాయుగానికి చెందిన అనేక రాతి పనిముట్లు ఇక్కడ కనిపిస్తున్నాయి. ఈ గుహల్లో ఆర్కియన్ శిలలు ఉన్నాయి.కొన్నిచోట్ల గుహలు 10, 50, 100 అడుగుల విస్తీర్ణంతో, కొన్నిచోట్ల గుండ్రంగా, మరికొన్ని చోట్ల పొడవు గదుల్లా ఉన్నాయి. గుహ ప్రారంభంలో వెలుతురు ఉన్నప్పటికీ లోపలికి వెళ్తున్న కొద్దీ చిమ్మచీకటి కమ్ముకుంటుంది. అక్కడక్కడా గుట్ట పైభాగం నుంచి పడే సూర్యరశ్మి వల్ల గుహలో కాస్త వెలుతురు ఉంటుంది. గుహలో గుండుసూది వేసినా స్పష్టంగా వినిపించేంత నిశ్శబ్దం ఉంటుంది. గుహలో 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, చల్లని గాలి ఉంటాయి. ఈ గుహల్లో సున్నపు రాతి నీళ్ళు జారిపడి అనేక ఆకృతులు ఏర్పడ్డాయి.

## హంపీకి వెళ్లినప్పుడు ఈ ఎలుగుబంట్ల
# అభయారణ్యాన్ని మర్చిపోవద్దు..!

హంపీకి సమీపంలో ఉండే దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యం గురించి తెలుసా..? బహుశా మనలో చాలా మందికి ఈ అరుదైన వన్యప్రాణి సంరక్షణ కేంద్రం గురించి తెలియకపోవచ్చు. దాని విశేషాలేంటో ఇక్కడ చదవండి.%హంపీ అంటే వెంటనే గుర్తొచ్చేది శ్రీ కృష్ణ దేవరాయల కాలం నాటి పురాతన ఆలయాలు, రాతి కట్టడాలే. దీంతో అది ఇప్పుడు ప్రముఖ పర్యాటక కేంద్రంగా, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా మంచి గుర్తింపు దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే చాలా మంది పర్యాటకులు ఈ హంపీని సందర్శించడానికి ఆసక్తి చూపుతుంటారు. అయితే, అక్కడికి వెళ్లేవారిలో కొంత మంది మాత్రమే సమీపంలోని దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని సందర్శిస్తారు. ఆ అభయారణ్యం గురించి చాలా మందికి తెలియకపోవడంతో కేవలం హంపీలోని చారిత్రక కట్టడాలను చూసి తిరిగొచ్చేస్తారు. ఒకవేళ మీరూ ఎప్పుడైనా హంపీకి వెళ్లాలనుకుంటే మీ ప్రయాణ జాబితాలో ఈ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని చూసి రావడం మర్చిపోవద్దు.


**కొంత మందికే అది తెలుసు..**

కర్నాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్న దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యం ఆసియాలోనే మొట్టమొదటి ఎలుగుబంట్ల అభయారణ్యం. అక్కడున్న రాతి కొండల్లో ఎలుగుబంట్లతో పాటు మరిన్ని వన్యప్రాణులు సైతం ఆవాసం పొందుతుంటాయి. దీంతో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణా కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇది యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రసిద్ధి చెందిన హంపీ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో అక్కడికి వచ్చేవారిలో కొంత మంది ఈ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని సందర్శిస్తారు. మరికొంత మందికి అలాంటి ఒక ప్రత్యేకమైన వన్యప్రాణి అభయారణ్యం అక్కడ ఉందనే విషయం తెలియక కేవలం హంపీని మాత్రమే సందర్శించి తిరిగి వెళిపోతుంటారు.

**?అభయారణ్యం ఎలా ఉంటుందంటే..**

%ఈ అభయారణ్యం మొత్తం బండరాళ్లు, రాతి గుహలు, ఉద్గారాల్లో ఉంటుంది. దీంతో అక్కడ పెద్దగా వృక్షసంపద కనిపించదు. అయితే ఇక్కడ ఎలుగుబంట్లు, చిరుతపులులు, హైనాలు, నక్కలు, పాంగోలిన్లు వంటి వివిధ రకాల వన్యప్రాణులతో పాటు కొన్ని జాతుల పక్షులూ ఆవాసం పొందుతున్నాయి. మరోవైపు ఈ అభయారణ్యం ఏడాది పొడవునా తెరిచి ఉన్నా అక్టోబర్ నుండి మే వరకు మాత్రమే సందర్శించడానికి అనుకూలంగా ఉంటుంది.

ఆ సమయంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు ఆయా వన్యప్రాణులను సైతం తేలిగ్గా చూసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే సందర్శకులు ఆ అభయారణ్యానికి వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి.

**నియమ నిబంధనలు ఇవే..**

సందర్శకులు అభయారణ్యం లోపల ఎలాంటి తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులను తీసుకెళ్లరాదు.

అభయారణ్యం లోపల పెద్ద శబ్దాలు చేయడం, హారన్లు మోగించడం, పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ ఏర్పాటు చేయడం వంటివి నిషేధం.

సందర్శకులు జంతువులకు ఆహారం అందివ్వడం, వాటిని రెచ్చగొట్టడం లేదా రాళ్లు విసరడం వంటివి చేయరాదు.

అభయారణ్యం లోపల పర్యాటకులు ధూమపానం, మద్యం పానం చేయడం కూడా పూర్తిగా నిషేధం.

సందర్శకులు వారి నిర్దేశిత ప్రాంతాల్లోనే ఉండాలి. అభయారణ్యం లోపల ఎల్లవేళలా గైడ్‌ల సూచనలు తప్పక పాటించాలి.

అభయారణ్యం లోపల ఫోటోగ్రఫీ అనుమతిస్తున్నా.. ఫ్లాష్ ఉపయోగించడం మంచిది కాదు. ఫ్లాష్ లేకుండా, జంతువులకు ఇబ్బంది కలిగించకుండా ఎన్ని ఫోటోలైనా తీసుకోవచ్చు.

**అక్కడికి ఎలా చేరుకోవాలి?**

రోడ్డు మార్గంలో ఈ అభయారణ్యానికి చేరుకోవాలంటే మొదట హంపీకి వెళ్లాలి. అక్కడి నుండి 15 కి.మీ దూరంలో ఈ అభయారణ్యం ఉంటుంది. మరోవైపు హంపీ, హొస్పేట్, బళ్లారి, హుబ్లీ వంటి నగరాల నుండి ట్యాక్సీ లేదా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొచ్చు. ఒకవేళ మీరు రైలులో వెళ్లాలనుకుంటే హొస్పేట్ సమీప రైల్వే స్టేషన్. అక్కడి నుండి 20 కి.మీ దూరంలో ఈ అభయారణ్యం ఉంటుంది. విమానంలో వెళ్లాలనుకుంటే హొస్పేట్ సమీపంలో ఉండే జిందాల్ విజయనగర్ విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుండి ట్యాక్సీలో వెళ్లొచ్చు. ఒకవేళ హైదరాబాద్ నుండి మీరు సొంత వాహనంలో వెళ్లాలనుకుంటే మహబూబ్‌నగర్, రాయిచూర్, సింధనూర్ మీదుగా హంపీకి వెళ్లొచ్చు. అది సుమారు 400 కి.మీ దూరం ఉంటుంది.

# అప్పుడు టమాటలు పండిస్తే కూలీ డబ్బులు కూడా రాలేదు.. ఇప్పుడు కోటీశ్వరులు అవుతున్న టమాట రైతులు

**కూరగాయలు సాగు చేసే రైతులకు ఎప్పుడు చూసినా ధరలు లేక అరకొర ఆదాయం వచ్చేది. గతంలో రూపాయికి కిలో టమాటలు విక్రయించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కొన్నిసార్లు కూలి డబ్బులు కూడా రాకపోతే.. రోడ్లపై పారబోసిన సంఘటనలు ఎన్నో జరిగాయి. అలాంటిది ఈసారి టమాటలకు మంచి ధర రావడంతో ఓ రైతు కోటీశ్వరుడు కాబోతున్నాడు. వికారాబాద్ జిల్లా పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన ఏ నర్సింహారెడ్డి స్వంత పొలం 4 ఎకరాలు, దోమ మండలం పాలేపల్లిలో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని ఏటా కూరగాయలు సాగు చేస్తారు. ఈసారి కూడా 10 ఎకరాలలో టమాట పంట సాగు చేశాడు.**

మల్చింగ్ విధానంతోపాటు డ్రిప్ సిస్టమ్‌లో పంట సాగు చేయడంతో మంచి దిగుబడి వచ్చింది. నెల రోజుల నుంచి టమాట పంట చేతికి అందడంతోపాటు క్రమంగా ధర పెరగడం వల్ల రైతు నర్సింహారెడ్డి పంట పండింది. ఇప్పటివరకు సుమారు 2,500 పైచిలుకు బాక్సుల టమాటాలు విక్రయించానని, ప్రస్తుతం ఒక బాక్సు టమాట ధర రూ.2,000 నుంచి రూ.2,500 వరకు పలుకుతున్నదని రైతు తెలిపాడు. ఇలా టమాటాల విక్రయం ద్వారా సుమారు రూ.30 లక్షలు పైగానే ఆదాయం వచ్చినట్టు నర్సింహారెడ్డి పేర్కొంటున్నాడు. ఇప్పటికి 30 శాతం పంటను విక్రయించగా 70 శాతం పంట పొలంలోనే ఉన్నది. మరో నెల రోజులలో మిగతా పంటను సైతం విక్రయించనున్నట్టు తెలిపాడు. టమాటా ధర ఇలాగే కొనసాగితే.. పంట పూర్తయ్యే వరకు రైతు నర్సింహారెడ్డికి సుమారు కోటి రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నది. ఉత్తమ రైతుగా ఎంపికైన నర్సింహారెడ్డిని రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో సీఎం కేసీఆర్ అభినందించారు.

**పంట దిగుబడి, మంచి ధరతో ఆదాయం**



ఏటా నా పొలంలో కూరగాయలు సాగు చేస్తాను. ఈసారి 10 ఎకరాలలో టమాట సాగు చేయగా చక్కటి దిగుబడి, మంచి ధర రావడంతో ఆదాయం పెరిగింది. ఇప్పటికే సుమారు 2,500 పైగా బాక్సుల టమాటలు విక్రయించాను. సుమారు రూ.30 లక్షల ఆదాయం వచ్చింది. 70 శాతం పంట చేతికి అందాల్సి ఉన్నది. ధరలు ఇలాగే కొనసాగితే టమాటల విక్రయం ద్వారా చక్కటి ఆదాయం వస్తుంది.

# ఆస్టర్ పూలకు మంచి డిమాండ్.!





బొకేలు, ఫంక్షన్లలో డెకరేషన్ కోసం ఉపయోగిస్తున్న సువాసనలు వెదజల్లే పూలకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. ఒకప్పుడు కేవలం లిల్లీ, గులాబీ పూలను మాత్రమే డెకరేషన్లో వాడేవారు. ప్రస్తుతం అందంతో పాటు సువాసనలు వెదజల్లుతూ అందరినీ ఆకట్టుకుంటున్న పూలు జాబితాలోకి ఆస్టర్ పూలు కూడా వచ్చి చేరాయి. మార్కెట్లో ప్రస్తుతం వీటికి మంచి డిమాండ్ ఉండటంతో రైతులు ఆరు బయట, పాలీ, గ్రీన్ హౌజ్ లు ఏర్పాటు చేసి సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. సాధారణంగా చల్లని వాతావరణంలో మాత్రమే పండే ఈ పంట తెలుగు రాష్ట్రాల్లో కూడా సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్న రైతులు ఎందరో ఉన్నారు. ఈ మొక్క వేర్లు కూడా నేలపైనే ఉంటాయి. కాబట్టి.. నీటి ఎద్దడిని, అధిక వర్షాలను తట్టుకోలేదు. అయినప్పటికీ కొంతవరకు ఉష్ణోగ్రతను తట్టుకొని దిగుబడినిస్తుంది. ఈ పంట సాగు చేస్తున్న నేల ఎప్పటికీ తేమగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి. ఈ మొక్క రకం ఆధారంగా నాటిన 70-80 రోజులకే దిగుబడి మొదలవుతుంది. అధిక ఉష్ణోగ్రతను కొంత వరకు తట్టుకుంటుంది. నీటి సౌకర్యం ఉంటే వేసవిలో కూడా సాగు చేయవచ్చు. ఆస్టర్లో పింక్, ఊదా, తెలుపు రంగు రకాల్లో పూలు ఉన్నాయి. అధిక దిగుబడితో పాటు ఆకర్షణీయంగా కనిపించే ముద్ద, పలుచని రకాల పూలకు మంచి డిమాండ్ ఉంది. కాబట్టి మార్కెటింగ్ ఇబ్బంది లేకుండా.. రైతు లాభాలు పొందవచ్చు. సారవంతమైన అన్ని రకాల నేలల్లో ఈ సాగు చేపట్టవచ్చు. ప్రధానంగా నీరు ఇంకే ఎర్ర గరప నేలలు సాగుకు అనువుగా ఉంటాయి. ఈ సాగు చేపట్టాలనుకుంటే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నారు పోసుకోవాలి. జనవరి నుంచి ఫిబ్రవరి వరకు దిగుబడి వస్తుంది. మొక్క నాణ్యతతో ఉండాలంటే నారు దశలోనే జాగ్రత్తలు వహించాలి. ఎకరా చేనులో సాగు చేయాలంటే దాదాపు 1-1.5 కిలోల విత్తనం సరిపోతుంది. మొక్కలు-వరుసల మధ్య 30 సెంటీమీటర్ల దూరం పాటించి విత్తుకోవాలి. ఈ సాగులో చీడల సమస్య కూడా పెద్దగా ఉండదు. ఈ పంట కాలం 4 నెలలు. దిగుబడి వస్తున్న కొద్దీ కోతలు చేపడుతుంటారు. ఒక పంటలో దాదాపు 10-15 కోతలు చేపట్టే అవకాశం ఉంటుంది. మేలైన సస్యరక్షణ చర్యలు చేపడితే దాదాపు ఎకరాకు 4-5 టన్నుల దిగుబడి సాధించవచ్చు.

# కాసుల పంట డ్రాగన్ ఫ్రూట్

## సాగు వివరాలు - ప్రభుత్వ ప్రోత్సాహం

కొత్త పంటలు సాగు చేస్తూ అధిక దిగుడులు సాధించడం కోసం తెలుగు రైతులు ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో ప్రధానంగా డ్రాగన్ ఫ్రూట్ ఒకటి. మొదట్లో అధిక పెట్టుబడి అవుతున్నప్పటికీ రైతులకు అధిక లాభాలు తెచ్చిపెడుతోన్న పంట ఇది. ఒక్కసారి నాటితే దాదాపు 15-20 ఏళ్లపాటు దిగుబడినివ్వడం, ఆశించిన దానికంటే ఎక్కువే ఆదాయం వస్తుండటంతో రైతులు సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇందులో ఉన్న పెద్ద సమస్యల్లా.. అధిక పెట్టుబడి. మొక్కలు, ఎరువులు, పోల్స్, ప్రధాన పొలం తయారీ, ట్రాన్స్పోర్ట్ ఛార్జీలు, డ్రిప్, కూలీ ఖర్చులన్నీ కలిపి ఎకరాకు దాదాపు రూ.6 లక్షలకు పైనే ఖర్చవుతుంది. ఈ ఫ్రూట్లో అధిక రోగనిరోధక శక్తి ఉండటం, ఔషధాల తయారీలో ఉపయోగించడంతో ప్రస్తుతం మార్కెట్లో భారీ డిమాండ్ ఏర్పడింది. విదేశాల్లో పండించే ఈ పంటకు అనుకూలమైన నేలలు మన దేశంలో ఉండటం విశేషం. దీంతో పాటు విత్తిన ఏడాది లోపే దిగుబడి మొదలై ఎక్కువ రోజులు రైతు లాభపడవచ్చు. 20-30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, నేల %జూ౧% 5.5 నుంచి 7 వరకు ఉన్న నేలల్లో ఈ మొక్క బాగా పెరుగుతుంది.

**ఎకరాకు 4 టన్నుల దిగుబడి:**

రసాయన ఎరువులతో సేద్యం చేయడం కంటే, సేంద్రియ విధానంలో సాగు చేస్తే అధిక లాభాలు, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని అనుభవమున్న రైతులు అంటున్నారు. కేవలం మొదటి ఏడాది పెట్టుబడి పెడితే మళ్లీ మీకు పెద్దగా ఖర్చేమీ ఉండదు. ఈ మొక్కలు, పండ్లను జంతువులు తినవు. చీడపీడల బెడద తక్కువే. మార్కెట్లో ప్రస్తుతం కిలోకు ధర రూ.150-200 వరకు పలుకుతోంది. మేలైన సేద్యం చేపడితే ఒక్కసారి పంట కోసినప్పుడు ఎకరాకు 2-4- టన్నులకు పైనే దిగుబడి వస్తుంది. టన్నుకు దాదాపు రూ.1.5లక్షల పైనే ఆదాయం ఉంటుంది. నాటుకున్న రెండో సంవత్సరం నుంచి రూ.9 లక్షల నికర దిగుబడి తీసుకోవచ్చు.

**సాగు వివరాలు:**

ఇది తీగ మాదిరిగా పాకుతూ పెరుగుతుంది. కాబట్టి కొమ్మలు వాలిపోకుండా ఎకరాకు దాదాపు 500 సిమెంట్ పోల్స్ను 10ఐ7



ఫీట్ల దూరంతో నాటుకోవాలి. పోల్ పై ఓ రౌండ్ సిమెంట్ బిళ్లను అమర్చాలి. కొందరు రైతులు టైర్లను అమరుస్తున్నారు. దీని ద్వారా మొక్కకు వేడి ఎక్కువ తాకి, కాయ, కాండం కుళ్లే అవకాశాలు ఉన్నాయి. ఒక్కో పోల్కు 4 మొక్కలు నాటుకోవాలి. అవి కిందికి వాలిపోకుండా.. తీగలు, ట్యూబ్లో గట్టిగా కట్టాలి.

**ప్రభుత్వ ప్రోత్సాహం:**

నీరు నిలువని సారవంతమైన అన్ని రకాల నేలలు, ప్రధానంగా ఇసుక నేలలు అనుకూలంగా ఉంటాయి. ఎంచుకున్న మొక్క రకాన్ని బట్టి ప్రతీ 15 రోజులకు ఒకసారి నీటిని అందించాలి. డ్రిప్ విధానం ద్వారా నీటిని అందిస్తే మొక్కలకు సమృద్ధిగా నీరు అంది, ఏకరీతిన పెరుగుతాయి. ఎకరం భూమిలో దాదాపు 1,800-2వేల వరకు మొక్కలు నాటుకోవాలి. ఒక చెట్టు దాదాపు 40-50 పండ్లనిస్తుంది. ఒక్కో పండు 400-500 గ్రాములు ఉంటుంది. సాధారణంగా రకాన్ని బట్టి, జూన్ నుండి డిసెంబర్ వరకు నెలకు ఒక పంట చొప్పున వస్తుంది. ఇందులో తెలుపు, ఎరుపు రకాలుంటాయి.

చాలా వరకు కొనుగోలుదారులు ఎరుపు రకాన్ని ఇష్టపడుతుంటారు. రుచికి తియ్యగా, అధిక ఔషధ గుణాలుండటంతో కొనుగోళ్లు ఎక్కువ జరుగుతున్నాయి.

కాబట్టి మీ నేల స్వభావం, మార్కెటింగ్ చూసుకున్న తర్వాతే సాగు మొదలుపెట్టండి. ప్రస్తుతం దీని సాగుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో రైతుకు కొంత వరకు ఆసరా అవుతోంది. నర్సరీల నుంచి మొక్కలు తెప్పించడం, గుంతలు తీయించడం, డ్రిప్ సౌకర్యం కల్పించడం వంటివి ప్రభుత్వమే చేస్తుంది. సాగుకు అధిక ఖర్చులు ఉండటంతో అర ఎకరానికి మాత్రమే రాయితీ ఇస్తుంది.

# పెటునియా పూల సాగు.!





పెటునియా ఎండాకాలంలో మాత్రమే పూసే వార్షిక మొక్క. కొన్ని రకాల పెటునియాలు బహు వార్షిక మొక్కలు. ఇది సొలనేసియా కుటుంబంలో చెందిన మొక్క. పెటునియా పూలు గరాటు ఆకారంలో ఉంటాయి. సంకరణ పద్ధతి ద్వారా వివిధ రకాల పూలు తయారు చేస్తారు. పెటునియా మొక్కలు బోర్డర్ మొక్కగా, కుండీలలో పెంచటానికి, వేలాడే పూల కుండీలలో వివిధ రకాలుగా పెంచవచ్చును. ట్రంపెట్ ఆకారంలో ఉన్న పెటునియా పూలు ఎండాకాలంలో ఫ్లవర్ బెడ్‌లలో, కిటికీలలో అలంకరణకు పెట్టి కుండీలలో పెంచుకోవచ్చు.

**రకాలు :** ల్కెమ్ ల్కెట్, రోజ్ స్టార్, షుగర్ డాడీ, కార్పెట్ సిరీస్, వేవ్ బ్లూ, ఫాంటసీ, మొదలగు రకాలు వివిధ రంగులలో, ఆకృతులలో పూలు వస్తాయి.

**వాతావరణం :** పెటూనియా మొక్కలు సూర్యకాంతి చానా అవసరం, సుమారుగా 5-6 గంటలు సూర్యకాంతి పడితే ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. నీడ ప్రాంతంలో పెంచితే తక్కువుగా పూలు వస్తాయి.

**నేలలు :** మంచి సారవంతమైన ఎర్ర నేలలు, ఇసుక నేలలు సాగుకు అనుకూలం, నేల ఉదజని సూచిక 6-7 ఉంటే మొక్క బాగా పెరుగుతుంది. ఉదజని సూచిక 7 కన్నా తక్కువుగా ఉంటే మొక్కలో ఇనుము లోపం తలెత్తుతుంది.

**ప్రవర్ధనము :** విత్తనం ద్వారా ప్రవర్ధనము : గ్రాండిఫ్లోర్ రకానికి చెందిన పెటూనియా మొక్కలను విత్తనం ద్వారా సాగుచేయవచ్చు. విత్తనం నాటడానికి ముందు నేలను బాగా దున్ను కోవాలి. దానికి కుళ్ళిన పశువుల ఎరువును కలుపుకొని నాటడానికి ఒక రోజు ముందు బాగా నీరు పెట్టాలి. 20-22% ఉష్ణోగ్రత వద్ద విత్తనం బాగా మొలకెత్తుతుంది. మొక్క వారం రోజుల వయసులో వేరు కుళ్ళ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

లేత కాండం మొక్కల ద్వారా ప్రవర్ధనము : సుమారు 3 ఇంచెస్ పొడవుగల లేత కాండం మొక్కలు కాండం చివర కొన నుండి తీసుకోవాలి. సగం పొడవున వరకు ఆకులను తీసివేయాలి. ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న మట్టి మిశ్రమంలో నాటుకోవాలి.

**నాటడం :** ఎప్పుడు అయితే కొమ్మకు 3 - 4 వరుసల ఆకులు వస్తాయో అప్పుడు వాటిని తీసి కుండీలలో నాటుకోవాలి. నాటడానికి ముందు కుండీలోని మట్టి మిశ్రమాన్ని పూర్తిగా తడిచేయాలి లేదా వివిధ ప్రదేశాలలో అలంకారం కోసం బెడ్డింగ్స్‌గా, బోర్డర్స్‌గా, గుంపులుగా ఈ మొక్కలను నాటుకోవచ్చు. ఎరువులు నాటడానికి ముందు నేలలో కుళ్ళిన పశువుల ఎరువును వేసుకోవాలి. నాటిన తరువాత 450 గ్రా. 10-10-10 ఎరువును చదరపు మీటరు వైశాల్యంలో ఉన్న నేలకి వేయాలి.

**నీటియాజమాన్యం :** పెటునియా మొక్క కొంత వరకు ఎండను తట్టుకుంటుంది. కానీ నేల రకాన్ని బట్టి, నేలలోని తేమ శాతాన్ని బట్టి వారానికి ఒక్క సారి కానీ, రెండు సార్లు కానీ నీటిని ఇవ్వాలి.

**తలలు తుంచడం :** మొక్క 15 సెంటీ మీటరు పొడవు పెరిగిన తరువాత తలలు తుంచడం చేయాలి. పెటునియాలలో తలలు తీయడం వల్ల శాఖీదు పెరుగుదల తగ్గి, పక్క కొమ్మలు ఎక్కువుగా వచ్చి పూలు ఎక్కువుగా వస్తాయి. ఎండిపోయిన పూలను తుంచివేయడం వలన కూడా కొత్త పూలు ఎక్కువుగా వచ్చే అవకాశం ఉంది.

**ప్రూనింగ్ :** ఎండాకాలం బాగా ముదిరిన తరువాత పెటునియా మొక్క కాండం బాగా పెరిగి వాటి చివరన పూలు వస్తాయి. ఇలాంటి సందర్భం లో కాండను ప్రూనింగ్ చేయడం ద్వారా ఎ క్కువుగా పక్క కొమ్మలు వచ్చి ఎక్కువ పూలు పూస్తాయి.

# తోటకూర.. అన్ని రుచుల కలిపిన ఆకు కూరని ఎలా సాగు చేయాలి?



మన రాష్ట్రంలో ఆకు కూరలన్నీ కలిపి ప్రస్తుతం సుమారుగా 16,740 ఎకరాలలో సాగుచేయబడి, 36,823 టన్నుల దిగుబడినిస్తున్నాయి. ఆకు కూరలు సమీకృత పోషకాహారంలో చాలా ముఖ్యమైన భాగం. ఇందులో ఎక్కువ లవణాలు, విటమిన్లు, ప్రోటీన్లు ఉన్నాయి.మనం పండించే ఆకుకూరల్లో తోటకూర ముఖ్యమైనది. ఎలాంటి పరిస్థితుల్లో పెంచటానికి అనువైనది. శీతాకాలంలో ఉష్ణోగ్రత 15 సెల్సియస్ కంటే తక్కువ ఉంటే పెరుగుదల సరిగా ఉండదు.ఇసుకతో కూడిన గరప నేలలు అనుకూలం. ఉదజని సూచి 6.0 – 7.0 ఉన్న నేలలు అనుకూలం.

నీరు నిలిచే బంకమట్టి నేలలు, ఇసుక నేలలు పనికిరావు. నేలను 4 – 5 సార్లు బాగా దుక్కిదున్నాలి. ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువును వేయాలి. మళ్ళను బాగా చదునుగా చేసుకోవాలి.తోటకూరని ఎక్కువగా వర్షాకాలం అయితే జూన్ నుండి అక్టోబరు నేలలో సాగు చేస్తారు. వేసవికాలంలో మే నేలలో సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుంది. ఎకరాకు 800 గ్రాముల విత్తనం అవసరమవుతుంది. విత్తనం వేసేటప్పుడు 10 రెట్లు సన్నటి ఇసుకతో కలిపి వేయాలి. నారుమడిలో పోసుకొని కూడా 20 సెం.మీ. దూరంలో నాటుకోవచ్చు. ఈ విధంగా చేస్తే 1 కిలో విత్తనం సరిపోతుంది. విత్తనం వెదజల్లితే ఎకరాకు 2 కిలోల విత్తనం కావాలి.

**తోటకూర రకాలు:**

ఆర్.ఎన్.ఎ. 1: ఆకులు, కాండం లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈ రకంలో విటమిన్ 'ఎ','సి'లు అధికంగా ఉండటంతో పాటు కాండం కూడా పీచు లేకుండా చాలా మృదువుగా ఉండి, రుచికరంగా ఉంటుంది. నెలరోజుల్లో ఒక ఎకరాకు 6-7 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. మొదటి కోత విత్తిన 15-20 రోజులకు వస్తుంది. కోత తరువాత బాగా శాఖలు విస్తరిస్తాయి. నీటి ఎద్దడి, తెల్ల ఆకుమచ్చ తెగులును తట్టుకొని అధిక దిగుబడి నిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని ప్రాంతాల్లో ఖరీఫ్, వేసవి కాలంలో పండించేందుకు అనువైనది.

ఆకులు,కాండం లావుగా ఉండి కండ కలిగి ఉంటాయి. ఒక ఎకరానికి 3-3.5 టన్నుల దిగుబడిని 25 రోజులలో ఇస్తుంది. ఆకులు వెడల్పుగా ముదురు ఆకుపచ్చ రంగుతో ఉంటాయి. విత్తనాలు చిన్నవిగా, నల్లగా ఉంటాయి.

ఆకులు కోలగ, ముదురు ఆకుపచ్చ రంగులో పొడవుగా ఉంటాయి. కాండం లేతగ, మృదువుగా ఉంటుంది. విత్తిన 30 రోజులకు కోతకు వస్తుంది. కాండం కూడ కూరగా పనికి వస్తుంది. ఎకరాకు 4-5 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. విత్తనాలు పెద్దవిగా, నల్లగా ఉంటాయి.

మొక్కలు పొట్టిగా, ఆకులు చిన్నవిగా ఉంటాయి.

**సిరికూర :**

మొక్కలు పొట్టిగ, ఆకులు చిన్నవిగ ఉంటాయి. కాండం, వేరు కలిసే చోట గులాబిరంగులో ఉంటుంది. నాటిన 25 రోజులకు లేత మొక్కలను కాండంతో సహా కూరగా వాడుకొనవచ్చు. ఈ రకాలే కాకుండా పూసాకీర్తి, పూసాకిరణ్, పూసాలాల్ చౌలై, అక్క అర్క అరుణ రకాలను కూడా రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు 20 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్ ల నిచ్చే ఎరువులను వేసి బాగా కలియదున్నాలి. కత్తిరింపులు తీసుకునే రకాలకు ఎకరాకు 30 కిలోల నత్రజనిని మూడు భాగాలుగా చేసి ప్రతి కత్తిరింపు తర్వాత నత్రజనిని వేసి నీరు పెట్టాలి.విత్తిన 15 %--% 20 రోజుల తర్వాత 20గ్రా యూరియా, ఒక లీటరు నీటికి, 20 పి.పి.యమ్ జిబ్బరెల్లిక్ ఆసిడ్ , ఒక లీటర్ నీటికి కలిపిన ద్రావణం పిచికారి చేస్తే అధిక లాభాలు వస్తాయి. అంతేకాక 25% నత్రజని ఆదా అవుతుంది. కలుపు నివారణకు ఎకరాకు డ్యుయల్ మందును తేలిక నేలలకు ఒక లీటరు లేదా బరువు నేలలకు 1.5 లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలుపుకొని విత్తినలు నాటిన 24 - 48 గంటలలో భూమిపై పిచికారి చేయాలి. భూమిలో తేమను బట్టి 7 - 10 రోజుల వ్యవధితో నీరు కట్టాలి. వేసవిలో ప్రతి 5 - 6 రోజులకు ఒక తడిని ఇవ్వాలి.

ఆకుల అడుగు భాగాన తెల్లటి బుడిపెల వంటివి ఏర్పడతాయి. ఆకు పైభాగాన లేత పసుపు రంగు మచ్చలు ఏర్పడి, పండుబారి ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 3గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మాంకోజెబ్ మందును కలిపి పిచికారి చేయాలి. ఆకుల అడుగు భాగం బాగా తడిచేలా చూడాలి.

చిన్న, పెద్ద పురుగులు ఆకులను కొరికి వేయడం వలన ఆకులు పనికి రాకుండా పోవడమేగాక, మార్కెట్ లో సరైన రేటురాదు. వీటి నివారణకు మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పిచికారి చేసిన తర్వాత కనీసం 10 రోజుల వ్యవధి ఇచ్చి ఆకుకోయాలి.

కోత రకాలలో విత్తిన 25 రోజులకు మొదటి సారిగా తరువాత ప్రతి వారం నుండి 10 రోజులకు ఒక కోత చొప్పున 90 రోజులలో 4 %--% 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మొక్కను వేర్లతో సహా పీకి కట్టలు కట్టే రకాలలో 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

# ఈ కోడి మాంసం కిలో 1200 రూపాయలు.!






కరోనా తర్వాత అందరూ ఉద్యోగం కన్నా వ్యాపార చేసుకోవడమే మేలు అన్ని అనుకుంటున్నారు. సొంత గ్రామంలో ఉండి అక్కడే వ్యాపారం చేసుకోవడానికి అందరూ ఇష్ట పడుతున్నారు. గ్రామంలోనే ఉంటూ లక్షల్లో లాభాలిచ్చే బిజినెస్ ఐడియాలతో వ్యాపారం చేయాలి అనుకున్న వారికి కడక్‌నాథ్ కోళ్ల వ్యాపారం మార్కెట్లో ఈ మధ్య కాలంలో బాగా సందడి చేస్తుంది. కడక్‌నాథ్ కోళ్లు నలుపు రంగులో ఉండి, వాటి రక్త మాంసాలు కూడా నల్లగానే ఉంటాయి.కడక్‌నాథ్ కోళ్ళలో కొలెస్టరాల్ తక్కువగా ఉండటం వల్ల హార్ట్, షుగర్ పేషెంట్ల ఈ కోళ్లను తిన్నడం ఆరోగ్యానికి మంచిది. ఈ కడక్‌నాథ్ కోళ్ళలో ఐరన్, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. కడక్‌నాథ్ కోళ్లను తిన్నడం వల్ల శరీరానికి చాలా పోషకాలు లభిస్తాయి. అందువల్ల మార్కెట్లో ఈ కోళ్ళకి మంచి డిమాండ్ ఉంది.మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కడక్‌నాథ్ కోళ్లను ఎక్కువగా పెంచుతున్నారు. ఈ ప్రాంతాల్లో కోడక్‌నాథ్ కోళ్లను కాలీమాసీ అని అంటారు. ఈ రాష్ట్రాల్లో కోడక్‌నాథ్ కోళ్ళకి మంచి డిమాండ్ ఉండటంతో కృషి విజ్ఞాన కేంద్రాలు కడక్‌నాథ్ కోడి పిల్లలను అందిస్తుంది. ఈ కడక్‌నాథ్ కోళ్లు మధ్యప్రదేశ్‌లోని ఝబువా జిల్లాలో పుట్టడం వల్ల ఆ కడక్‌నాథ్ కోళ్లుకు జిఐ ట్యాగ్ కూడా ఇచ్చారు.

ఈ కడక్‌నాథ్ కోళ్ల వ్యాపారాన్ని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సబ్సిడీలు, పథకాలు ఇస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో కడక్‌నాథ్ కోళ్ల వ్యాపారానికి 53,000 పెట్టుబడి అవుతుంది. ఈ 53,000 పెట్టుబడిని ప్రభుత్వ అకౌంట్లో డిపాజిట్ చేస్తే, ప్రభుత్వమే 1000 కోడిపిల్లలు, 30 కోళ్ల జాలీ, 6 నెలల పాటు ఉచిత దాణాను ఇచ్చి టీకా, ఆరోగ్య సంరక్షణ బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుంటుంది. ఈ కోళ్ల మార్కెటింగ్ కూడా ప్రభుత్వం సహాయం చేస్తుంది.

ఒక్క కడక్‌నాథ్ కోడిపిల్ల 70-100 రూపాయలు ఉంటుంది. ఈ కడక్‌నాథ్ కోడి గుడ్డు 20-30 అమ్ముతున్నారు.ఇతర రాష్ట్రలో 1000 కడక్‌నాథ్ కోడిపిల్లలతో వ్యాపారికి షెడ్ నిర్మించడానికి, కేజ్‌లల్లో పెంచడానికి, దాణా, ఇతర ఖర్చులు 4 లక్షలు వరకి పెట్టుబడి అవుతుంది. ఈ కడక్‌నాథ్ కోడిపిల్లలలు మూడు నాలుగు నెలల్లో అమ్ముకోవచ్చు.ఒక్క కడక్‌నాథ్ కోడి రెండు కిలోల వరకి పెరుగుతుంది. ఒక కిలో కడక్‌నాథ్ కోడి 1000-1200 వరకు మార్కెట్లో అమ్ముతున్నారు. ఈ కోళ్ల వ్యాపారం ఆన్లైన్ ద్వారా కూడా చేస్తున్నారు. ఆన్లైన్లో ఒక కోడి 800 వరకి అమ్ముతున్నారు. 1000 కోడి పిల్లలతో వ్యాపారం చేస్తే 9 లక్షల వరకి లాభాలు వస్తాయి.

# బీర సాగులో అద్భుతాలు.. లక్షల ఆదాయం.!



కూరగాయల సాగు, ఉత్పత్తిలో ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్. మన రైతులు ఎప్పటికప్పుడు అధునాతన పద్ధతులు, సంకరజాతి విత్తనాలు ఉపయోగిస్తూ కూరగాయల సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పూర్వ బీర సాగు చేసిన రైతులు నేలపై పాటించేవారు. ఆ విధానంలో పెద్దగా దిగుబడులు వచ్చేవి కావు. నేడు కొందరు రైతులు అడ్డ పందిరి విధానంలో బీర సాగు చేస్తూ లక్షల్లో సంపాదిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట సమీపంలో మండపిల్లి గ్రామ రైతు పార్వతీశం బీర సాగులో అపార అనుభవం గడించారు. ఏటా మూడు పంటల బీర సాగు చేస్తూ ఆదర్శ రైతుగా నిలిచారు.

అడ్డు పందిరి విధానంలో అధిక దిగుబడులు

నెల రోజులు పాకిన మొక్కలను అడ్డు పందికి పాకిస్తారు. ముందుగా అవు కర్రలు వాటిని అల్లుతూ లంగరు వైరు చుట్టి వాటికి బీర మొక్కలను పాకిస్తున్నారు. తీవ్రమైన గాలులు వచ్చినా అడ్డు పందిరి పడిపోకుండా కట్ట కర్రలు ఉపయోగిస్తున్నారు. లంగరు తీగ కేజీ రూ.300 ఉంటుంది. 25 సెంట్ల భూమికి 5 కేజీలు అవసరం అవుతుంది. అంటే 25 సెంట్లకు రూ. 1500 ఖర్చవుతోంది. లావు తాడు మరో 5 కేజీలు అవసరం ఉంటుంది. నెల రోజులు నేలపైన పాకిన మొక్కలను లంగరు వైరుకు పాకిస్తున్నారు. దీని వల్ల దిగుబడులు బాగా పెరుగుతున్నాయి. కాయ కోయడం కూడా చాలా తేలిక. 75 రోజులకే బీర లో మంచి దిగుబడులు తీయవచ్చని పార్వతీశం తెలిపారు. పంట వేసిన రెండున్నర నెలల నుంచి ఆ తరవాత మూడు నెలల వరకు దిగుబడి వస్తుంది. ఇలా 105 రోజుల పాటు రోజు విడిచి రోజు బీర కాయల దిగుబడులు వస్తున్నట్లు రైతు పార్వతీసం వారి అనుభవాలను పంచుకున్నారు.

ఈస్ట్ కోస్ట్ కంపెనీకి చెందిన రామా అనే వెరైటీ బీరను సాగు చేసి ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం తీస్తున్నారు. 25 సెంట్లలో రోజు మార్చి రోజు వంద కేజీల దిగుబడి వచ్చిందని రైతు తెలిపారు. కిలో రూ.40కి విక్రయించారు. 25 సెంట్లలో 30 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. ఇలా సగటున కిలో రూ.30 ధర అనుకున్నా 25 సెంట్లలో రూ.90 వేల ఆదాయం సంపాదిస్తున్నారు.

సొరసాగులో రైతు దిట్ట

సొర, బెండ సాగుతో ఏటా రూ.2 లక్షలు సంపాదిస్తున్నారు.కేవలం 90 సెంట్ల భూమిలో మూడు రకాల కూరగాయలు సాగు చేస్తూ సంవత్సరం పొడవునా దిగుబడులు సాధిస్తున్నారు. ఏటా మూడు పంటలు, మూడు రకాల కూరగాయల సాగుతో ప్రతి రోజూ ఆదాయం వస్తోందని రైతు పార్వతీశం చెబుతున్నారు. పొలం వద్దకే వచ్చి వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళుతున్నారని ఆయన చెప్పారు.

# సేంద్రియ వ్యవసాయంలో చెరుకు సాగు చేయడం ఎలా ?



నీటి సదుపాయం ఉన్న మెరక భూములు లేదా తోట భూములు అనువైనవి. తేమను పోషకాలను ఎక్కువగా నిలుపుకోలేని తెలికనేలలను సేంద్రియ పదార్థాలువేసి అభివృధి పరచి చెఱకు నాటు కోవాలి . సారహీనమైన, లోతు తక్కువ కలిగి నేల పైపోరా గట్టి పడే భూము లను లోతైన దుక్కిచేసి ఎకరాకు 1 టన్ను పొడిగా చేసిన వేరుసెనగ తొక్కలను లేక వారి ఊక వేసి అభివృద్ధి పరచుకోవాలి . పాల చౌడభూముల్లో చెఱకు నాటేటపుడు, ముందుగా లవణాలను మురుగు నీటి కలవ ద్వారా తిసివేయాలి. లవణ పరిమితి నేలలో సెంటి మీటరుకు 2 మీలీ మోస్ లకన్నా ఎక్కువ ఉండకూడదు. క్షారభుములకు జిప్సం వేసి అభివృధి పరచి నాటుకోవాలి రేగుర్ నేలలో నిజామాబాదు, చల్క భూముల్లో 45 సెం.మీ. వరకు లోతు దుక్కి చేస్తే వేళ్ళ వ్యాప్తి బాగా ఉంటుంది.

పూత పూయని చెరుక చిగురు భాగంగాని, 7-8 నెలల వయస్సు గల లేవడి తోటల చెరుకును గాని మూడు కళ్ళ ముచ్చెలుగా కొట్టి విత్తనంగా వాడాలి . లేవడి తోటలను పెంచేందుకు ముదురు తోగుల నుంచి సేకరించిన గడలను మొదలు, చివర 1/3 భాగాలకు తీసివేసి మూడు కళ్ళ ముచ్చెలుగా చేసి, వేడి నీటిలో 52 సెల్సియస్ వద్ద 30 నిముషాలు లేదా తేమతో మిళితమైన వేడి గాలి 54 సెల్సియస్ వద్ద 4 గంటలు విత్తన శుద్ధి చేయాలి . వేడి నీటి విత్తన శుద్ధి ద్వారా కాటుక, గడ్డిదుబ్బ, ఆకుమాడు తేగుళ్ళను అరికట్టవచ్చు.

%కోస్తా ఆంధ్రాలో జనవరి %--% మార్చి మాసాల్లో, తెలంగాణాలోని ఎక్సాలి పంటను డిసంబర్ జనవరిలో ఆడాల్సి ఆగష్టు, సెప్టెంబర్లోను, రాయలసీమ ప్రాంతంలో జనవరి, ఫెబ్రవరిలోను నాటుకోవచ్చు. ముందుగా ఆడుటకు నవంబరు, జనవరి , మధ్యకాలంలో ఆడుటకు ఫెబ్రవరి %--% మార్చి, ఆలస్యంగా ఆడుటకు మార్చి లో అనువైన రకా నేలను 25-30 సెం .మీ లోతు వరకు ఇనుప నాగలితో దున్ని మెత్తటి దుక్కి చేయాలి 4-6 వారాలకు ముందు ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు లేదా 5 టన్నుల బాగా ఆరిన పొడి ఫిల్టర్ మడ్డి వేసి కలియ దున్నాలి. చదును చేసిన తరవాత కాలువలను, బోదెలను రిడ్జర్ లేదా రెక్కల నాగలితో వేసుకోవాలి. కాలువ వెడల్పు 30 సెం .మీ లోతు 20 సెం మీ వుండాలి . చాళ్ళ మద్య స్వల్పకాలిక 80 సెం .మీ మద్యకాలిక రకాలకు 90 సెం .మీ ఆలస్యంగా వర్షాధారంగా నాటే చెఱకు కు 60 సెం.మీ ఎడం ఉండాలి.

పచ్చిరొట్ట ఎరువులు:

పొలంలో పైరు లేనపుడు పచ్చిరొట్ట పైర్లు జనుము, జీలుగ, పిల్లి పెసర పెంచుకొని 50 శాతము పుత దసలో ఉన్నపుడు భూమిలో కలియ దున్నాలి.

సేంద్రియ ఎరువులు:

4-6 వారాలకు ముందు ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు లేదా 5 టన్నుల బాగా ఆరిన పొడి ఫిల్టర్ మడ్డి వేసి కలియ దున్నాలి. నత్రజని నందించే జీవన ఎరువులైన అజటోబాక్టర్ 2 కిలోలు ఎకరాకు లేదా అజోస్పైరిల్లం 4 కిలోలు ఎకరాకు 500 కిలోల పశువుల ఎరువులో కలిపి 2 దఫాలుగా నాటిన మూడవ రోజున సగభాగం నాటిన 45 వ రోజున మిగిలిన సగభాగాన్ని వేసుకోన్నట్లితే నత్రజని ఎరువుల్లో షుమారు 25 శాతం వరకు తగ్గించుకోవచ్చు. అలాగే ఎకరాకు 4 కిలోల ఫాస్ఫో బాక్టీరియా ముచ్చెలు నాటిన తరువాత ఆరవ రోజున జివ తడి ఇచ్చేముందు వేసుకుంటే భాస్వరపు ఎరువుల్లో షుమారు 25 శాతం వరకు ఆదా చేయవచ్చు.

పంట మొదటి నాలుగు నెలల్లో బాల్యదశ ఆరు రోజులకొకసారి, పక్వదశలో నవంబరు నుండి చెఱకు నరికే వరకు మూడు వారాలకొకసారి నీరు పెట్టాలి. బిందు సేద్యపద్ధతి అవలంభించడం వలన పరిమిత నీటి వనరులను పొదుపుగా వాడుకోవచ్చును జంట పాళ్ళ పద్దతిలో 2.5లి3.5 చెరుకు సాగు చేసినప్పుడు, బిందు సేద్యపద్ధతి లో ఖర్చును తగిన్చుకోవచ్చును. నీటి ఎద్దడి పరిస్థితుల్లో చెరుకు నాటిన 3 వ రోజు ఎకరాకు 1.25 టన్నుల చొప్పున చెత్త కప్పటం ద్వారా భూమిలోని తేమ త్వరగా కోల్పోకుండా నివారించడంలో బాటు కలుపు, పీక పురుగుల ఉధృతి తగ్గించవచ్చు . ఈ యూరియా, మ్యురేట్ ఆఫ్ పోటాష్ 2.5 శాతాన్ని పైరు మీద పిచికారి చేయాలి . చెరువుల క్రింద వర్షాధారంగా సాగుచేసినపుడు, చెఱకు తోటకు బాల్య దశలో మొదటి తడిపెట్టిన 30 రోజులకు రెండవ తడిని పెట్టడం మంచిది వర్షాకాలంలో తోటల్లో నీరు నిల్వకుండా చూడాలి. మురుగునీటి కాల్వల ద్వారా గాని, నత్తగుల్ల లేదా ఆర్కిమెడిస్ సు ద్వారా నీటిని త్వరగా తీసివేయాలి. సాగునిటిలో లవణాల సాంద్రత అధికంగా ఉన్నపుడు 2 మి.ల్లీ మోస్లు సెం.మీ.కు, సోడియం కార్బోనేట్ అవశేషం లీటరు కు 5 మి.ల్లీ ఈక్వివలెంట్ల కన్నా అధికంగా ఉన్నపుడు పంచదార దిగుబడులు రసనాణ్యత తగ్గుతాయి.

## ఎడిటోరియల్

# పాతాళానికి దీదీ ప్రతిష్ఠ

పశ్చిమ బెంగాల్‌లో 25,753 మంది ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది నియామకాలను రద్దు చేస్తూ కోల్ కతా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సమర్థిస్తూ భారత సుప్రీం కోర్టు 2025 ఏప్రిల్‌లో ఇచ్చిన రూలింగ్ రాష్ట్రంలో రాజకీయంగా, సామాజికంగా తీవ్రమైన గందరగోళానికి దారితీసింది. 2016లో పశ్చిమ బెంగాల్ స్కూల్ సర్వీస్ కమిషన్ ఈ నియామకాలు జరిపింది. ఈ ప్రక్రియలో తీవ్రంగా అవకతవకలు జరగడంతో ఈ తీర్పు వచ్చింది. నియామకాల ప్రక్రి య పూర్తిగా మోసపూరితంగా ఉందని కోర్టు నిర్ధారణకు వచ్చింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై అశనిపాతం సుప్రీం కోర్టు తీర్పు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద ఎదురుదెబ్బ. ప్రభుత్వం అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిందనితేల్చిచెప్పినట్లయింది. ప్రస్తుతం నిర్బంధంలో ఉన్న మాజీ విద్యాశాఖ మంత్రి పార్థ చటర్జీ, టిఎంసిలో ఉన్నత స్థాయి నాయకుల ప్రమేయంతో ఈ కుంభకోణం జరగడం రాజకీయంగా తీవ్రనష్టం చేకూర్చింది. ముఖ్యంగా ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ, సిపిఎం వంటి పార్టీలు ఈ తీర్పును తమకు అనుకూలంగా ఉపయోగించుకుని, టిఎంసి పూర్తిగా అవినీతిమయం అని ఆరోపిస్తున్నాయి. దీంతో భవిష్యత్‌లో ఎన్నికలకు ముందే మమత పార్టీ ప్రతిష్ఠ మరింత దిగజారే అవకాశం ఉంది. సుప్రీం కోర్టు తీర్పుతో ప్రతిపక్షాలకు బ్రహ్మాస్త్రం దొరికినట్లయింది. అమిత్ మాల్వియ, సంబిత్ పాత్ర వంటి నాయకులు దీనిని నగదు కొట్టు -జాబ్ పట్టు అన్న కుంభకోణంగా చిత్రీకరించడమే కాక, టిఎంసి అధికార దుర్వినియోగానికి నిదర్శనంగా చూపుతున్నారు. బెంగాల్‌లో విద్యాబోధన గొప్ప గౌరవంగా భావిస్తారు. పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాలలో ప్రతిపక్షాల ప్రచారం ప్రభుత్వానికి దెబ్బే. ఇటీవల కాలంలో రాష్ట్రంలో సిపిఎం ప్రభావం క్షీణించింది, అయినా ఆ పార్టీ టిఎంసి విద్యా వ్యవస్థను నిర్వహిస్తున్న తీరును తూర్పారబడుతోంది. పారదర్శకత లోపించిందని ఆరోపిస్తోంది. బెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతాలలో టిఎంసి బలమైనదే. అయినా ప్రతిపక్షాల విస్తృత ప్రచారం వల్ల ప్రభుత్వపాలనపై వ్యతిరేకత పెరగవచ్చు. సిఎం మమతా బెనర్జీ తీర్పును బహిరంగంగా తిరస్కరించినా, దానిని అమలు చేస్తామని హామీ ఇవ్వడం తీర్పును రాజకీయంగా ప్రేరేపించబడినదిగా చిత్రీకరించడం ఆమె వ్యూహాన్ని సూచిస్తోంది. బిజెపి, సిపిఎంలను ఆమె దుమ్మెత్తిపోస్తూ బెంగాల్‌లో విద్యా వ్యవస్థను అణగదొక్కడానికి కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ, ఆ పార్టీల నిందలను తిప్పికొట్ట లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అయితే, ఆమె వ్యాఖ్యలు- న్యాయవ్యవస్థ నిష్పాక్షికతను ప్రశ్నించడం వల్ల న్యాయ వ్యవస్థలో ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదం -ముమ్ముందు ఆమె పాలనపై మరింత స్క్రూటినీ జరిగే అవకాశం ఉంది. టిఎంసి సర్కార్‌కు సవాళ్లే మూడు నెలలలోపు కొత్త నియామక ప్రక్రియ చేపట్టాలని కోర్టు ఇచ్చిన ఆదేశం రాష్ట్ర ప్రభుత్వానికి పెను సవాల్‌గా నిలుస్తోంది. కొత్త ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడం, మరింత పకడ్బందీగా నిర్వహించడంతోపాటు ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడం చాలా కీలకం. మళ్లీ ఏదైనా తప్పు జరిగితే సంక్షోభం మరింత జటిలమవుతుంది.

ఈ తీర్పు ఒక్క రోజులో వేలాది మందిని నిరుద్యోగులుగా మార్చేసింది. నిరుద్యోగ సమస్యను పరిష్కరించవలసిందిగా టిఎంసిపై రాష్ట్ర వ్యాప్తంగా ఒత్తిడి పెరగవచ్చు. అలాగే ఇది తిరిగి ప్రజాదరణ పొందేందుకు పలు ప్రజాకర్షణ చర్యలకు దారి తీసే అవకాశం ఉంది. ఒక్కసారిగా 25 వేల మందికి పైగా ఉద్యోగుల తొలగింపు బాధిత టీచర్లు, బోధనేతర సిబ్బందికి తీవ్ర మనస్తాపాన్ని మిగిల్చింది. వీరిలో న్యాయబద్ధంగా నియమింపబడినవారు ఎందరో. ప్రతాప్ రాయ్ చౌదరి, తంపి ఆలం వంటి వారు తమ వ్యాసాలలో ఉపాధి కోల్పోయిన వారి ఆర్థిక, భావోద్వేగాలు, ఎదుర్కొనే నష్టాలు, ఇఎంఐలు, కుటుంబాలపై ఆధారపడిన వారి అనిశ్చిత భవిష్యత్‌ను వివరించారు. సామూహిక తొలగింపు ప్రజల్లో నిరాశా నిస్పృహలు కలిగించే ప్రమాదం ఉంది. వీరిలో సమస్యపై ప్రభుత్వం దృష్టి పెట్టని పక్షంలో నిరసనలకు, సామాజిక అశాంతికి దారితీసే అవకాశం ఉంది.పశ్చిమ బెంగాల్‌లో మహిళలు విద్యాబోధన పట్ల మక్కువ చూపుతారు. ఈ వృత్తికే వారి ప్రథమ ప్రాధాన్యం. మహిళా సాధికారతకు, ముఖ్యంగా సామాజికంగా గౌరవం కలిగించే వృత్తిగా భావిస్తారు. ఈ తీర్పు మహిళా టీచర్లలో తీవ్రమైన అశాంతిని రగిల్చింది.

# చేనేతల్లో బహుముఖ ప్రజ్ఞ



%గంటల తరబడి శ్రమిస్తేనే నోట్లోకి ఒక ముద్ద. సృజనాత్మక కళాకృతులను ప్రపంచానికి అందించాలనే ఒక దృఢ సంకల్పం. మగ్గాల నుంచి ఆధునిక మరమగ్గాల వరకు ఏ మిషనరీని ఉపయోగించినా నేతన్న చేయి లేకుంటే వస్త్రంగా ఆకృతి దాల్చదు. నాటి నుండి విభిన్న పరిణామాల అనంతరం రకరకాల వస్త్రాలుగా రూపుదిద్దుకొని, అద్దకంతో సొబగులు అద్దుకొని మార్కెట్లో ఆవిష్కరించబడుతున్నాయి. ఆ క్రమంలో అనేక సృజనాత్మక మేధస్సుతో కళలు చోటుచేసుకోవడం ఒక గొప్ప విషయం. చేతి రుమాల నుంచి మొదలుకొని పట్టువస్త్రాల వరకు అనేక విభాగాలలో ఒక్కో ఆవిష్కరణలో ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుంటాయి. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మరమగ్గాలు ఉన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పద్మశాలి వర్గం నేతవృత్తిని నమ్ముకొని పరిశ్రమలతో జీవనోపాధి పొందుతున్నాయి. కష్టపడి పని చేసి చేనేత కార్మికులు కొందరు యజమానుల వరకు ఎదిగారు. ఆ క్రమంలో అనుకూల, ప్రతికూల పరిస్థితుల కారణంతో అనేక మార్పులు సంభవించడం సిరిసిల్ల పరిశ్రమ వర్గాలలో సహజంగా ఉన్నాయి.ఇతర వృత్తులలో కంటే చేనేత వృత్తిలో కార్మికుడు ఏకధాటిగా గంటల పాటు శ్రమను వెచ్చిస్తేనే గాని ఒక ఆకృతి ముందుకు రాదు. సునిశితమైనటువంటి డిజైన్లు, అనేక సాంకేతిక విభాగాలను మిషనరీల ద్వారా అనుబంధ పరిశ్రమల కూర్పుతో ప్రత్యేకమైనది. స్పెండల్ మిషన్లు, వార్పిండ్లు, డయింగులు, లూమ్స్, ట్విస్టింగ్ మిషన్లు, సైజింగ్‌లు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఫినిషింగ్ విభాగాలు ఇలా అనేకమైనటువంటివి వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తికి ప్రత్యేక మూలాలు. ఒక్కొక్క విభాగంలో పలు రకాల నైపుణ్యత కలిగిన కార్మికుల శ్రమ ప్రత్యేకంగా ఉంటుంది. చేనేతలు ప్రత్యేక అనుభవంతో కూడిన చేనేత కార్మికుని సృజనాత్మక ప్రత్యేకత. కాలక్రమేణా సాంకేతిక మిషనరీ విభాగాలలో ప్రత్యేకతలు ఎన్ని వచ్చినప్పటికీ చేనేత వస్త్ర ఉత్పత్తిలో నిబద్ధతతో కూడిన కార్మికశక్తి ఎక్కువ శాతంగా కేంద్రీకృతమైంది. సిరిసిల్ల ప్రాంతంలో తయారైన వస్త్రాలు దేశం నలుమూలల్లోకి వెళ్లి బహుళజాతి కంపెనీల ఉత్పత్తుల పోటీకి సరసన నిలిచి 'అగ్గిపెట్టలో చీర'ను సృష్టించిన ఘన చరిత్ర సిరిసిల్లకే దక్కింది.యజమాని నుండి కార్మికుని వరకు మధ్యలో కలిగిన అనేక విభాగాలలో వ్యవస్థ సమ్మేళితంగా మనుగడ సాగుతున్న క్రమంలో.. కార్మికులు, ఆసాములు, యజమానులు మూడు దశల్లో పరిశ్రమ విరాజిల్లుతుంది. మొదటగా కొన్ని ఏళ్ల శ్రమతో కార్మికుడిగా మొదలై ఆసాములుగా, యజమానులుగా ఎదిగిన వారు ఉన్నారు. కుటీర పరిశ్రమలోని అనేక మూలాలలో వారి మధ్య అనుబంధం కనిపిస్తుంది. నేతవృత్తిని నమ్ముకున్న కుటుంబాలలో ఇంటిల్లిపాది శ్రమించి వస్త్రోత్పత్తిలో భాగమవడం సిరిసిల్ల నేత పరిశ్రమలో ఒక ప్రత్యేకం. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన సిరిసిల్ల నేత వర్గంలో అనేక ఏళ్లుగా ఉత్పత్తిలో మాంద్యంను అనేక సార్లు ఎదుర్కొన్నారు. అయినా వాళ్లు నమ్ముకున్న వృత్తిని వీడలేదు. చేనేత బతుకు జీవన పోరాటంలో నిత్యం ఒక ఆవిష్కరణ కోసం అన్వేషణ జరుగుతూనే ఉంటుంది.ఆనాడు చేనేత మగ్గం ద్వారా ఉత్పత్తి గావించి అనేక అద్భుతాలు సృష్టించారు. నేడు ఆధునిక రేపర్ లూమ్స్‌పై కూడా వారి మార్కును చాటుకున్నారు. కాలక్రమేణా అనేక కొత్త ఉత్పత్తి యంత్రాలు రూపుదాల్చుకున్ననూ మార్కెట్ ఎగుడు దిగుడు పరిస్థితులను ఎదుర్కోవడం వారికి తప్పలేదు. అందుకు ప్రత్యేక కారణంగా ఒకసారి పరిశీలిస్తే దేశంలో బొంబై, సూరత్, సోలాపూర్, అహ్మదాబాద్, గుజరాత్, భీవండిలలో వస్త్ర ఉత్పత్తి కేంద్రీకృతమైన విషయం అందరికీ తెలిసిందే. సిరిసిల్ల వస్త్ర ఉత్పత్తి పరిశ్రమతో దేశంలో ప్రసిద్ధి చెందిన వస్త్ర ఉత్పత్తి కేంద్రాలను పోల్చి చూస్తే అనేక వ్యాపార ఉత్పత్తి విభాగాలు భిన్నంగా ఉంటాయి. అందుకు ప్రత్యేక కారణంగా చెప్పాలంటే సిరిసిల్లకు రవాణా సదుపాయాలలో రైలు మార్గం లేకపోవడం, పెద్ద మార్కెట్లకు అనుసంధానంగా లేకపోవడం ఇది ఒక వెనుకబాటు అని చెప్పవచ్చు.ముడిసరుకులు గానీ, తయారైన ఉత్పత్తులు గానీ ఎగుమతి దిగుమతి విషయంలో నేరుగా సంబంధాలు పెద్ద మార్కెట్లతో లేకపోవడం జరుగుతుంది. తయారైన వస్త్రాన్ని ఇతర రాష్ట్రాల మార్కెట్లలోకి నేరుగా గతంలో ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు దక్కకపోవడం గమనార్హం. సిరిసిల్లలో టెక్స్‌టైల్ పార్క్, అపెరల్ పార్కు కలవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్‌పిఎం, చీరల తయారీ, మ్యాక్స్ సొసైటీలు, నూలు డిపో ఇలా సిరిసిల్ల నేత వర్గాలకు ఇచ్చి ఊరట కలిగించాయి. మరిన్ని పథకాలను కూడా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త విధానాలను కూడా సిరిసిల్ల నేత వర్గానికి అందివ్వడం ప్రభుత్వాలు చేస్తున్న కృషికి నిదర్శనం. నైపుణ్యత, కళాత్మకతలతో పాటు వృత్తిపై బాధ్యతతో శ్రమించి పని చేసే తత్వం కలిగిన నేత వర్గానికి ఆదరించే అవకాశాలు, పథకాలు పెద్దపీట వేస్తున్నాయి.

# మహమ్మారి వ్యాధిలో మరో రకం!



%మధుమేహం అనేది ఇవాళ కొత్తగా వెలుగు చూసిన వ్యాధి కాదు. దశాబ్దాల తరబడి ప్రపంచవ్యాప్తంగా కోరలు చాస్తూ, వేల సంఖ్యలో ప్రాణాలు కబళిస్తోంది ఈ మహమ్మారి. హిందూ, ఈజిప్టు ప్రాచీన గ్రంథాలలో సైతం ఈ వ్యాధి ప్రస్తావన ఉందంటే ఇది ఎంత పురాతనమైనదో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు గోరుచుట్టుపై రోకటి పోటులా ఈ వ్యాధిలోనే మరో రకం బయటపడటం, అది ప్రాణాంతకమని వైద్యనిపుణులు పదేపదే హెచ్చరికలు జారీ చేస్తూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మధుమేహంలో టైప్ 1, టైప్ 2 అనే రకాలు ఉన్నాయని మాత్రమే అందరికీ తెలుసు. కానీ, కొత్తగా టైప్ 5 రకం బయటపడినట్లు ఇంటర్నేషనల్ దయాబెటిస్ ఫెడరేషన్ (ఐడిఎఫ్) ఇటీవల అధికారికంగా ప్రకటించింది. బ్యాంకాక్‌లో జరిగిన సదస్సులో ఐడిఎఫ్ ప్రతినిధులు టైప్ 5 లక్షణాల గురించి వివరిస్తూ, పోషకాహార లోపంతో ఈ వ్యాధి పొడసూపుతోందనడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

అమితాహారం తీసుకోవడం మధుమేహ కారకాల్లో ఒకటి కాగా, పోషకాలు లోపించడమూ మధుమేహానికి దారితీస్తుందనడం ఆశ్చర్యం కాక మరేమిటి? సాధారణంగా 40 ఏళ్ల పైబడినవారిలోనే మధుమేహ లక్షణాలు బయటపడటం కద్దు కాగా, టైప్ 5 రకానికి 19 ఏళ్ల లోపు యువత ఎక్కువగా లోనవుతున్నట్లు ఐడిఎఫ్ స్పష్టం చేస్తోంది. టైప్ 1, టైప్ 2 రకాలను మందులు లేదా ఇంజెక్షన్లతో అదుపు చేసే అవకాశం ఉండగా, టైప్ 5 మధుమేహాన్ని గుర్తించడమూ, నయం చేయడమూ కూడా కష్టమేనన్నది వైద్యనిపుణుల అభిప్రాయం. ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామ లేమి, జన్యుపరమైన కారణాల వల్ల ఎక్కువగా సంక్రమించే మధుమేహ వ్యాధికి ఆసియా దేశాలే చిరునామాగా మారాయి. అందులోనూ చైనా, ఇండియా, పాకిస్తాన్‌లదే అగ్రస్థానం. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్థులు ఉండగా, ఒక్క మన దేశంలోనే ఆ సంఖ్య ఏడున్నర కోట్లకు పైగా ఉన్నట్లు అంచనా. అంతెందుకు, పాతికేళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలోనూ ఒకరికి టైప్ 2 దయాబెటిస్ ఉన్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) లెక్కగట్టడం కలవరం కలిగించే విషయమే.1980లో ప్రపంచవ్యాప్తంగా 10.8 కోట్ల మంది మధుమేహ రోగులు ఉండగా, 2014 నాటికి ఈ సంఖ్య 40 కోట్లకు పెరిగిందంటే ఈ వ్యాధి విస్తరణ ఎంత ప్రమాదకరంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక తెలుగు రాష్ట్రాలలోనూ మధుమేహ విస్తృతి అంతకంతకూ ఎక్కువవుతోంది. మధుమేహ వ్యాధిగ్రస్థుల సంఖ్యలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉందన్న సంగతి విస్మరించరాని విషయం. టైప్ 5 దయాబెటిస్ ను 1955లో తొలిసారిగా జమైకాలో గుర్తించినట్లు చెబుతున్నారు. దీనిని ఒక విభిన్నమైన మధుమేహంగా 1985లో ప్రపంచ ఆరోగ్య సంస్థ వర్గీకరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా టైప్ 5 దయాబెటిస్ బారినపడిన వారి సంఖ్య రెండున్నర కోట్లకు పైమాటేనని వైద్యులు చెబుతున్నారు.

పోషకాహార లేమి కారణంగా ఈ వ్యాధి సంక్రమిస్తున్నట్లు వైద్యుల పరిశోధనలలో తేలిన నేపథ్యంలో పేదలే ఎక్కువగా దీనిబారిన పడే ప్రమాదం ఉంటుంది.వైద్య నిపుణులు చెబుతున్న దానిని బట్టి టైప్ 5 రకం మధుమేహాన్ని గుర్తించేందుకు, నిర్ధారించేందుకు అవసరమైన విధానాలపై విస్తృత పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది. మొదటి రెండు రకాలకు ఈ కొత్త రకం తోడై, ప్రజల ప్రాణాలను కబళించక ముందే ప్రభుత్వాలు మేలుకొనడం మంచిది. వైద్య పరిశోధనలకు నిధులు కేటాయించడంతోపాటు ఈ సరికొత్త రకం వ్యాధి గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరం. ఇటీవల చెన్నైలో ఏర్పడిన దయాబెటిస్ బయో బ్యాంకుల వంటివి దేశవ్యాప్తంగా విస్తరించాలి. జీవనమూనాలను సేకరించి ప్రాసెస్ చేయడం, నిల్వ చేయడంతోపాటు ఐసిఎంఆర్ తోడ్పాటుతో పరిశోధనలు సాగించే బయో బ్యాంకులు మధుమేహంపై యుద్ధం చేయడంలో భవిష్యత్తులో కీలక పాత్ర పోషిస్తాయడంలో సందేహం లేదు. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. నియంత్రణే గానీ నివారణ లేని మధుమేహం ముప్పునుంచి భావిభారతాన్ని తప్పించేందుకు పటుతరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యం.

# రామ్ చరణ్ గ్లోబర్ స్టార్ అంటున్న ఆనంద్ మహీంద్రా



ప్రస్తుతం ఎక్కడ చూసినా రామ్ చరణ్ ఫోటోలే కనిపిస్తున్నాయి. ఆయన ప్రస్తుతానికి అమెరికాలో ఒక అవార్డులు ఈవెంట్ కి హాజరయ్యేందుకు వెళ్లడంతో... ఆయన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాజమౌళితో కలిసి అవార్డు అందుకున్న రామ్ చరణ్ ఫోటోలు... సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో ఆయన మీద మెగా హీరోలు సహా కొంతమంది తెలుగు హీరోల సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ... ఆనంద మహీంద్రా చేసిన ట్వీట్ వైరల్ అవుతుంది. కొద్దిరోజుల క్రితం గుడ్ మార్నింగ్ అమెరికా అనే ఒక కార్యక్రమంలో రామ్ చరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంగతి తెలిసిందే. సౌత్ నుంచి ఈ కార్యక్రమంలో హాజరైన మొట్టమొదటి హీరోగా రామ్ చరణ్ రికార్డులకు ఎక్కాడు. అయితే ఈ కార్యక్రమానికి సంబంధించి గుడ్ మార్నింగ్ అమెరికా టీం ట్విట్టర్లో ఒక వీడియో పోస్ట్ చేయగా దాన్ని షేర్ చేసిన వ్యాపార దిగ్గజం ఆనంద మహీంద్రా... ఈ మనిషి ఒక గ్లోబల్ స్టార్. ప్రస్తుతం ఆయన పీరియడ్ నడుస్తోంది... అని అర్థం వచ్చేలా ఆయన కామెంట్ చేశారు.

వాస్తవానికి కొద్దిరోజుల క్రితం హైదరాబాదులో కార్ రేసింగ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్ రేసింగ్ ఈవెంట్ కోసం ఆనంద్ మహీంద్రా కూడా హైదరాబాద్ విచ్చేశారు. అప్పుడు హైదరాబాదులోనే ఉన్న రామ్ చరణ్ తేజ్ ఆనంద్ మహీంద్రా తో కలిసి సందడి చేశారు. వీరిద్దరూ కలిసి అప్పట్లో నాటు నాటు స్టెప్ కూడా వేయగా... అది సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇక ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటారన్న సంగతి అందరికీ తెలిసిందే. దీంతో ఆయన ఎప్పటికప్పుడు సమకాలీన అంశాల మీద కూడా స్పందిస్తూ ఉంటారు. ఈ మధ్యకాలంలో ప్రాజెక్టు కే సినిమా కోసం కూడా ఆనంద్ మహేంద్ర కంపెనీ తరఫున సహకారం అందిస్తున్న సంగతి తెలిసిందే. అలాంటి ఆనంద్ మహీంద్రా ఇప్పుడు రామ్ చరణ్ మీద ప్రశంసలు కురిపించడం హాట్ టాపిక్ గా మారింది. ఇక ఆనంద్ మహీంద్రా ట్వీట్ మీరు కూడా చూసేయండి మరి.


# అమ్మ-నాన్న కోసమే నాని హీరోగా!



నేచురల్ స్టార్ నాని ఎలాంటి సినీ బ్యాక్ గ్రౌండ్ లేకుండా వచ్చి స్టార్ అయిన సంగతి తెలిసిందే. అసిస్టెంట్ డైరెక్టర్ గా కెరీర్ ప్రారంభించి అనుకోకుండా హీరో అయ్యాడు. నాటి నుంచి తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తు న్నారు. అయితే ఆయన స్టార్ అవ్వడం వెనుక చాలా పెద్ద కథే ఉందని తాజాగా ఓ టాక్ షోలో ఆయన వ్యాఖ్యల్ని బట్టి తెలుస్తోంది.

' మా అమ్మకి ఒక్కసారైనా నన్ను తెరపై చూడాలన్నది ఆశ. ఆమె సంతోషం కోసమైనా ఒక్కసారైనా నటిస్తే బాగుంటుందని తొలిసారి నాకు బీజం పడింది అప్పుడే. ఆరోజు అమ్మ అలా అనకపోయి ఉంటే వేరే రంగంలో ఉండేవాడినేమో. నాకే కాదు మా నాన్నకి కూడా ఆయనకి చిన్నప్పుడు సినిమా పిచ్చి ఉండేది. ఆ పిచ్చితో ఆయన అప్పట్లో మద్రాసుకి పారిపోయాడు కూడా. 'విజయవాహిని స్టూడియో' గేటు దగ్గర రెండు రోజుల పాటు నిలబడ్డారట. లోపలికి వెళ్లాలని ప్రయత్నిస్తున్నా పంపించడం లేదుట. అప్పుడాయన్ని నాగిరెడ్డి గారి కుమార్తె చూసింది. అప్పుడామే ఏ ఊరు మీది అని అడిగితే .. వెనక్కి పంపిస్తారేమోనని ఆయన నిజం చెప్పలేదుట. దాంతో తమతో పాటు నాన్నని వాళ్ల ఇంటికి తీసుకుని వెళ్లారు. అక్కడే ఆయన వారం రోజుల పాటు ఉన్నారు. ఆ వారం ఆయన్ని ఎంతో బాగా చూసుకున్నారు. ఆ తర్వాత మాటల్లో పెట్టి ఎక్కడ నుంచి వచ్చావ్ అని అడిగితే నిజం చెప్పేసారుట. దీంతో విషయం ఇంట్లో తెలియడం ఇక్కడ నుంచి మనుషులు వెళ్లడం.. నాలుగు తగిలించి తీసుకురావడం జరిగింది. మా ఇంట్లో అప్పటి నుంచి సినిమా పిచ్చి అనేది ఉంది. కాకపోతే ఆయన నటుడు కాలేకపోయాడు. నేను అయ్యాను ' అని నాని చెప్పుకొచ్చారు. అలా నాని సినిమాల్లోకి రావడానికి ప్రత్యక్ష కారకులు తల్లిదండ్రులు అయ్యారు. నాని వద్ద అమ్మ ఆ మాట అనకపోయినా..నాన్న విజయవాహిని స్టూడియో చుట్టు రౌండ్లు వేయకపోయనా నాని వచ్చేవాడు. ఈ విషయంలో తల్లిదండ్రులు కుమారుడికి చెప్పడం అన్నది నాని సక్సెస్ లో కీలక భాగంగా చెప్పొచ్చు. తల్లిదండ్రులు ఇచ్చిన ధైర్యంతోనే నాని సినిమా ప్రయాణం మొదలైందని చెప్పొచ్చు.

# కృతిశెట్టి వేగం తగ్గిందే!



టాలీవుడ్ కి ఉప్పెన తో దూసుకొచ్చింది ముంబై బ్యూటీ కృతిశెట్టి. తొలి సినిమా 'ఉప్పెన'తోనే బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకుంది. దీంతో వరుసగా అవకాశాలు క్యూ కట్టాయి. అదనంగా అమ్మడు బ్యూటీ సినిమాలకు అస్సెట్ గా మారింది. 'శ్యామ్ సింఘరాయ్'..'బంగార్రాజు'...' వారియర్'..'మాచర్ల నియోజక వర్గం' లాంటి చిత్రాల్లో నటించింది. వాటి ఫలితాలు ఎలా ఉన్నా? కృతి కి మంచి భవిష్యత్ ఉంటుందని అంతా భావించారు.కానీ ఇప్పుడా వేగం కృతిలో కనిపించలేదు. కృతి డేటా చెక్ చేస్తే 'కస్టడీ' మినహా మరో కొత్త సినిమా లేదు. అవును అమ్మడి చేతిలో నాగచైతన్య సరసన నటిస్తోన్న 'కస్టడీ' తప్ప మరో తెలుగు చిత్రం కనిపించడం లేదు. దీంతో ఈ సినిమా కృతికి కీలకంగా మారింది. ఈ సినిమా విడుదలై సక్సెస్ అయితే తప్ప కొత్త ఛాన్స్ వచ్చేలా లేదని నెట్టింట ప్రచారం సాగుతోంది. ఇక్కడ చైతన్య సెంటిమెంట్ కూడా వర్కౌట్ అవ్వాలి. గతంలో 'బంగార్రాజు' సినిమాలో చైతన్యకి జోడీగా నటించింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాలు సాధించింది. మరోసారి అదే సక్సెస్ సెంటిమెంట్ వర్కౌట్ అవ్వాలి. లేకపోతే కృతికి మరో తెలుగు అవకాశం కష్టమనే అంటున్నారు. నాయికల మధ్య ఉన్న పోటీ సహా కొత్త భామల ఎంట్రీ కూడా జోరుగా సాగుతుండటంతో ఫెయిల్యూర్స్ అవకాశాలకి దూరం చేస్తాయన్న వాదన గట్టిగానే వినిపిస్తుంది.మరి ఈ సవాళ్లనంటిని ఎలా ఎదుర్కొంటుందన్నిచూడాలి. వారియర్ తో కోలీవుడ్ లోనూ లాంచ్ అయింది. ఈసినిమా అక్కడ బ్యూటీకి తొలి చిత్రం. నేరుగా తమిళ హీరోతో రొమాన్స్ చేసే ఛాన్స్ అయితే ఇంత వరకూ రాలేదు. అయితే మాలీవుడ్ లో మాత్రం ఎంట్రీ ఇచ్చేసింది. ప్రస్తుతం అక్కడో సినిమా చేస్తుంది. మరి టాలీవుడ్ భవిష్యత్ ని గెస్ చేసి ముందుగానే అక్కడ లాంచ్ అవుతుందా? లేక సడెన్ గా వచ్చిన అవకాశమా? అన్నది తెలియాలి. మరి కృతి కెరీర్ ఎలా ప్లాన్ చేసుకుందన్నది చూడాలి.

# ప్రకాష్ రాజును తాతను చేసిన త్రివిక్రమ్



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా 28వ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పూజా హెగ్డే ఒక హీరోయిన్ గా నటిస్తోంది. మరో హీరోయిన్ గా శ్రీలీల నటిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. కానీ అందుకు సంబంధించిన అధికారిక సమాచారం అయితే లేదు.ఇప్పుడు తాజాగా త్రివిక్రమ్ మహేష్ బాబు కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాకి సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేమిటంటే సూపర్ స్టార్ మహేష్ బాబు 28వ సినిమాలో ప్రకాష్ రాజు ఒక కీలకపాత్రలో నటిస్తున్నాడని తెలుస్తోంది. అయితే ఇందులో పెద్ద వార్త ఏముంది అనుకుంటున్నారా? ఇక్కడే ఉంది అసలు మ్యాజిక్. అదేమిటంటే త్రివిక్రమ్ సినిమాలో తాత పాత్రను చాలా అందంగా ఎమోషనల్ గా డిజైన్ చేస్తూ ఉంటాడు. గతంలో ఆయన తెరకెక్కించిన అతడు సినిమాలో నాజర్ను ఖలేజా సినిమాలో కోటా శ్రీనివాసరావును అజ్ఞాతవాసి అత్తారింటికి దారేది వంటి సినిమాల్లో బొమ్మన్ ఇరానీ అలవైకుంఠపురం సినిమాలో సచిన్ ఖేడ్కర్ వంటి వారిని అలాంటి తాత పాత్రలో చూపించి ఆకట్టుకున్నాడు.ఇప్పుడు ప్రకాష్ రాజుని కూడా మహేష్ బాబు తాత పాత్రలో చూపించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజం ఎంత ఉందో తెలియదు కానీ.. ఈ విషయం గురించి టాలీవుడ్ వర్గాల్లో ఇదే పెద్ద ఎత్తున చర్చ మాత్రం జరుగుతోంది. ఇక ఈ విషయం గురించి టాలీవుడ్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ఏమిటంటే.. త్రివిక్రమ్ గతంలో ఎప్పుడో విడుదల సూపర్ హిట్ అయిన సినిమాలను నేటి ట్రెండ్ కి తగ్గట్టుగా మార్చుకుని చిన్న చిన్న మార్పులు చేసి ఎవరికీ అర్థం కాకుండా రిలీజ్ చేస్తారని అంటున్నారు. ఇప్పుడు ఈ విషయంలో కూడా అదే ఫార్ములా ఫాలో అవుతున్నారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎందుకంటే టాలీవుడ్ లో గతంలో తాత మన వల్ల సెంటిమెంట్తో వచ్చి సూపర్ హిట్ అయిన సినిమాలు ఎన్నో ఉన్నాయి అలాంటి సినిమా ఏదైనా రీమేక్ చేస్తున్నారని అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## సైడ్ యాంగిల్‌లో డీజే రాధిక

# మత్తెక్కిస్తోంది బాబోయ్



గల్లీ రౌడీ సినిమాల్లో నటించిన సమయంలో నేహా శెట్టిని తెలుగు ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోలేదు. కానీ సిద్దు జొన్నలగడ్డ జోడీగా డీజే టిల్లు సినిమాలో రాధిక పాత్రలో నటించిన తర్వాత నేహా శెట్టి యొక్క క్రేజ్ అమాంతం పెరిగింది. హీరోయిన్ గా డీజే టిల్లు సినిమా తో మొదటి విజయాన్ని ఈ ముద్దుగుమ్మ దక్కించుకున్న విషయం తెల్సిందే.డీజే టిల్లు తర్వాత వరుసగా సినిమా ఆఫర్లు వస్తాయని అంతా భావించినా కూడా పాపం నేహా శెట్టి కి ఆఫర్లు మాత్రం అంతంత మాత్రంగానే తలుపు తడుతున్నాయి. ఆఫర్లు రాకున్నా కూడా తన యొక్క అందాల విందుతో సోషల్ మీడియాలో ఈ అమ్మడు రెగ్యులర్ గా ట్రెండ్ అవుతూనే ఉంటుంది.తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. సైడ్ యాంగిల్ లో నేహా శెట్టి తన నడుము అందాలను మరియు ఎద ఎత్తులను చూపిస్తూ కవ్విస్తోంది.

ఇంతటి అందం ఈ అమ్మడి సొంతం అయినా కూడా సినిమాల్లో ఆఫర్లు ఎక్కువగా రాక పోవడం విడ్డూరంగా ఉందంటూ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.సోషల్ మీడియాలో ఈ అమ్మడి ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఇంత అందంగా ఉన్న రాధిక ను డీజే టిల్లు 2 ఎందుకు వద్దు అనుకున్నాడో అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ముందుకు వంగి తన అందాన్ని మరింతగా చూపించే ప్రయత్నం చేసిన నేహా శెట్టి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవ్వాల్సిందే.

## ఇంత హాట్‌గా వండి

# వడ్డిస్తే ఎవరైనా తట్టుకోగలరా?



బిగ్ బాస్ తో మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ దివి. ఈ అమ్మడు బిగ్ బాస్ కు ముందు సోషల్ మీడియా లో కానీ.. సినిమాలో కానీ పెద్దగా గుర్తింపు దక్కించుకోలేక పోయింది. ఎప్పుడైతే బిగ్ బాస్ లో ఎంట్రీ ఇచ్చిందో అప్పటి నుండి ఈ అమ్మడు హీరోయిన్ రేంజ్ లో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. హీరోయిన్ రేంజ్ ఫిజిక్ ఈ అమ్మడిది అనడంలో సందేహం లేదు. హీరోయిన్స్ కు ఏ మాత్రం తక్కువ కాకుండా అందాల విందు చేయడంలో ఈ అమ్మడు ముందు ఉంటుంది. అలాంటి ముద్దుగుమ్మ దివి సోషల్ మీడియాలో రెగ్యులర్ గా షేర్ చేసే హాట్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా మరోసారి ఇలా చెఫ్ వేశంలో దివి సందడి చేసింది. బోటమ్ యాంగిల్ లో కెమెరా పెట్టి థైస్ ను చూపిస్తూ దివిని మరింత అందంగా ఈ ఫొటోలో చూపించడం జరిగింది. ఇలా అందాల ఆరబోత చేస్తూ మత్తెక్కించే విధంగా ఉంటే ఏమైనా ఉందా అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.ఇంత హాట్ గా ఉన్న దివి చేసిన ఆ వంట తిన్న అదృష్టవంతులు ఎవరో కదా అంటూ కొందరు సోషల్ మీడియా లో చర్చించుకుంటున్నారు. మొత్తానికి దివి చాలా క్రియేటివ్ గా ఇలాంటి అందాల ఆరబోత ఫొటోలను షేర్ చేస్తూ సోషల్ మీడియాలో తన పాపులారిటీ ఇంకా ఇంకా పెంచుకుంటూ ఉంది. టాలీవుడ్ లో కాకున్నా ముందు ముందు ఇతర భాషల్లో అయినా దివి బిజీ అవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.